www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

సోమవారం 01-07-2024 | విజయవాడ ప్రచురణ | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | సంపుటి : 73, సంచిక : 10 పేజీలు : 8, వెల: రూ.5.00

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పండుగలు ప్రారంభం

రూ.7,000ల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీతో తొలి పండుగ నేడు

ముఖ్యమంత్రిగా శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి మూడవ సంతకం
చారిత్రాత్మక నిర్ణయం.. ఇకపై రూ.4000 పింఛను

"నేడు మీరు అందుకుంటున్న రూ.4000లో మన ప్రభుత్వ హయాంలో పెంచిందే రూ.2875 అని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను"

"గత ప్రభుత్వం విడతల వారీ పెంపు అంటూ చేసిన మోసంతో ఒక్కొక్కరికి రూ.32000 నష్టం"

+

=

జూలై నెల పింఛను	ఏప్రిల్, మే, జూన్ నెల పింఛను పెంపు	మొత్తం
రూ. 4000	రూ. 3000	రూ. 7000

పేదలకు అండగా "ఎన్టీఆర్ భరోసా"

- 28 వర్గాలకు చెందిన 65,18,496 మంది లబ్దిదారులకు పింఛన్ల పంపిణీ
- దేశ చరిత్రలో తొలిసారిగా ఒకే రోజు పింఛన్ల కోసం రూ.4408 కోట్ల పంపిణీ
- పెరిగిన పింఛన్లతో ప్రభుత్వంపై ప్రతి నెల అదనపు భారం రూ.819 కోట్లు,
- గడచిన మూడు నెలలకు పెంచిన పింఛను కోసం చేస్తున్న ఖర్చు రూ.1650 కోట్లు
- వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, డప్పు కళాకారులు, హిజ్రాలు, హెచ్ఐవీ బాధితులు, కళాకారులకు రూ.3000 నుంచి రూ.4000లకు పెంపు
- దివ్యాంగులకు ఎన్నడూ లేని విధంగా పింఛను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంపు
- తీవ్రమైన అనారోగ్యంతో వీల్ చైర్ లేదా మంచానికి పరిమితమైన వారికి పింఛను రూ.5 వేల నుంచి ఏకంగా రూ.15000లకు పెంపు
- కిడ్నీ, కాలేయం, తలసేమియా బాధితులకు రూ. 5 వేల నుండి రూ.10,000లకు పెంపు
- కుష్టువ్యాధి కారణంగా వైకల్యం పొందిన వారికి నెలకు రూ. 6 వేలు

ఇకపై నెలనెలా 1వ తేదీన ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ

మీ భద్రత – మా బాధ్యత

పేదలపక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

బలహీనపడితే పౌరహక్కులకు భంగమే

'మేకా' శతజయంతి సభలో ఈశ్వరయ్య

విశాలాంధ్ర-చల్లపల్లి: అధికారం ఉన్నా... లేకున్నా ఎల్లవేళలా పేదలపక్షాన పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని, అవి బలహీన పడితే పౌర హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం మేకావారిపాలెంకు చెందిన కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు మేకా సీతారామయ్య శతజయంతి వేడుకలు ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈశ్వరయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టులు మరణించినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారని అన్నారు. కమ్యూనిస్టు నేతలు బతికినంత కాలం ప్రజలే తమ ఆస్తిగా భావిస్తారన్నారు. సీతారామయ్య మనమధ్య లేకపోయినా పోరాటల రూపంలో ప్రజల మనస్సులో చిరస్థాయిగా ఉంటారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకు వచ్చిన మూడు నల్ల చట్టాలపై జరిగిన పోరాటాల్లో కమ్యూనిస్టు పార్టీల నాయకత్వమే వెనకుండి నడిపించిందని గుర్తు చేశారు. నాలుగు వందలకుపైగా పార్లమెంట్ స్థానాలను సాధిస్తానని చెప్పుకున్న మోదీకి ప్రభుత్వం ఏర్పాటుకు కావలసిన మ్యాజిక్ ఫిగర్ రాకుండా చేయడంలో కమ్యూనిస్టు పార్టీల పాత్ర కీలకమని ఆయన వివరించారు. కమ్యూనిస్టు అగ్ర నాయకుడు చంద్ర రాజేశ్వరరావు వారసుడు మేక సీతారామయ్య అని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో పనిచేసిన సీతారామయ్య ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్లడమే ఈతరం నాయకులు ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. తొలుత 'సీతా రామయ్య చరిత్ర ' ప్రత్యేక సంచికను నాయకులు ఆవిష్కరించారు.

సీపీఐ సీనియర్ నేత మాలెంపాటి కాంచనరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి టి. తాతయ్య, రాష్ట్ర నాయకులు నార్ల వెంకటేశ్వరరావు, వెలగపూడి ఆజాద్, రైతు నాయకులు చంద్రప్రసాద్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబు, చెరుకు శ్రీనివాసరావు, పైడిపాముల గురు ప్రసాద్, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ మేక రమేశ్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మల్లు పెద్ది రత్నకుమారి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు హనుమానుల సురేంద్ర బెనర్జీ, గుత్తికొండ రామారావు, మేక నరసింహారావు, రామారావు ప్రసంగించారు. అంతకుముందు సీతారామయ్య స్వగ్రామమైన మేకావారిపాలెంలో స్థూపం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రద్ధాంజలి ఘటించి సభా ప్రాంగణం వరకు ర్యాలీగా వచ్చారు. సీతారామయ్య చిత్రపటానికి ఈశ్వరయ్య పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ప్రజానాట్య మండలి నాయకుడు ఆర్. పిచ్చయ్య ఆలపించిన విప్లవ గేయాలు ఆహుతులను ఆలోచింపజేశాయి. మల్లుపెద్ది బోసు, కొర్రపాటి ముఖర్జీ, అట్లూరి వెంకటేశ్వరరావు, చంద్ర సుబ్బారావు, సబ్బినేని బాబురావు, టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు, నక్కా శ్రీనివాసరావు, కొల్లూరి శ్రీధర్, పాలడుగు రత్నబాబు, పెన్మత్స ప్రభాకర్, నాగమల్లి, సిద్దాబత్తుల వాసు పాల్గొన్నారు.

రైతాంగానికి సాయిల్ హెల్త్ కార్డులివ్వాలి

మంత్రి అచ్చెన్నాయుడుకు ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతాంగానికి సాయిల్ హెల్త్ కార్డులు ఇచ్చి సూక్ష్మపోషకాలు 75 శాతం సబ్సిడీపై అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఒక లేఖ రాశారు. పంటకు జీవాధారం భూసారమని, అనేక ఏళ్లుగా అధికంగా ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల నేలలు సారాన్ని కోల్పోతున్నాయని వివరించారు. దాని ప్రభావంతో పంట దిగుబడులు తగ్గిపోతున్నాయని, భూమి స్వభావం మారిపోతున్నదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎడారిగా మారే ప్రమాదం ఉంటుందని శాస్త్రవేత్తల నిశ్చితాభిప్రాయమని, ప్రకృతిలో మనం తయారు చేయలేనిది మట్టి ఒక్కటేనని పేర్కొన్నారు. గుప్పెడు మట్టిలో ఉండే జీవరాశులు భూగోళం మొత్తం మీద ఉండే జనాభాకన్నా ఎక్కువేనన్నది నమ్మలేని నిజమన్నారు. మట్టిలో 16 రకాల పోషకాలు ఉంటాయని, క్రమేపీ పోషకాల శాతం తగ్గిపోతున్నదని వివరించారు. మట్టి నమూనా సేకరించి తద్వారా అవసరమైన సూక్ష్మపోషకాలు ఎప్పటికప్పుడు భూమికి అందించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మట్టి నమూనాల సేకరణ, సూక్ష్మపోషకాలు అందించడంలో తీవ్ర అశ్రద్ధ జరిగిందని గుర్తుచేశారు. వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తమరు భూ సార పరీక్షల ప్రాధాన్యతను మట్టిలోని పోషకాల శాతాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రస్తుతం భూమి నమూనాలు తీసే ప్రక్రియ కొనసాగుతోందని, సాయిల్ హెల్త్ కార్డులు (ఎస్‌హెచ్‌సీ) ప్రతి రైతుకు ఇచ్చి ఆ రైతు భూమికి అవసరమైన సూక్ష్మపోషకాలు 75 శాతం రాయితీపై అందించి, నేల ఆరోగ్యాన్ని కాపాడి పంటల అధిక దిగుబడులు సాధించి మన రైతులు నికర ఆదాయం పొందేలా కృషి చేయాలని ఆ లేఖలో కేవీవీ ప్రసాద్ కోరారు.

మూడు వారాల్లో రూ.7 వేల కోట్ల అప్పులా?

వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధికారంలోకి వస్తే మేం సంపద సృష్టిస్తాం, అప్పులు చేయబోమని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం మూడు వారాల్లోనే రూ.7 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్లకు అప్పులు తెచ్చేందుకు ఏర్పాట్లు చేశారని, మరి సంపద సృష్టించడం అంటే ఇదేనా? అని వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి కె.రవిచంద్రారెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరి మరో నాలుగు రోజుల్లో నెల రోజులు పూర్తి కావొస్తుందని, సాంకేతికంగా జులై 12కు నెల రోజులవుతుందని చెప్పారు. చంద్రబాబు మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, జులై 1వ తేదీన పెన్షన్ల కోసం కొంత వెసులుబాటు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంపద సృష్టిస్తామన్న మాట మీద నిలబడాలని, మీ హామీల అమలుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని, లబ్ధిదారులందరికీ అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. జులై 1న ఇచ్చే పెన్షన్లు వలంటీర్లతో కాకుండా సచివాలయ ఉద్యోగులతో ఇస్తున్నారు కదా?, ఇది ఒక్క రోజుకేనా?, లేక పూర్తిగా ఇదే పద్ధతి కొనసాగిస్తారా? స్పష్టత ఇవ్వాలంటూ నిలదీశారు. మరి వలంటీర్లకు రూ.5 వేలకు బదులుగా రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామన్నారు కదా... మరి వారిని ఏం చేస్తారు?, అమ్మ ఒడిని తల్లికి వందనం పేరుతో ఇస్తామన్నారు కదా?, పాఠశాలలు ప్రారంభమయ్యాయని, వాటిని ఎప్పుడు ఇస్తారంటూ నిలదీశారు. కేంద్రం నుంచి రైతులకు రైతు భరోసా సాయం అందిందనీ, మరి మీరిచ్చిన మాట ప్రకారం రైతులకు సాయం ఎప్పుడు చేస్తారో తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మీరు వైసీపీ కార్యాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం, ఆస్తుల విధ్వంసం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. కూటమి ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా జనరంజక పాలన చేయాలేగానీ, ఇలా దాడులకు దిగడం సరికాదని హితవు పలికారు. ఇలాంటి అరాచకాలకు, విధ్వంస పాలనకు ముగింపు పలికి, ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై దృష్టి సారించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

ప్రభుత్వానికి సచివాలయ ఉద్యోగుల సంఘం వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగుల సమస్యలన్నీ అపరిష్కృతంగానే మిగిలిపోయాయని, వాటి పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. విజయవాడ మనోరమ హోటల్‌లో ఆదివారం సంఘం రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొండారెడ్డి నరహరి వరప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సభకు అధ్యక్షత వహించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గునిపే రాజేశ్ మాట్లాడుతూ గత వైసీపీ పభుత్వం వార్డు, శానిటేషన్, ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలకు జీవో 423 జారీజేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. గ్రేడ్ 2 వీఆర్వోలకు గ్రేడ్ 1 వీఆర్వోలుగా పదోన్నత కల్పించేందుకు ఇచ్చిన జీవో 166ను అమలు పరచలేదన్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగులకు లేని ఏకరూప దుస్తుల వ్యవస్థను సచివాలయ ఉద్యోగులకు కల్పించిందని, తద్వారా ప్రభుత్వ ఉద్యోగులు సచివాలయ ఉద్యోగులు వేర్వేరన్న భావనను గత ప్రభుత్వం కల్పించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనర్జీ అసిస్టెంట్లు విధి నిర్వహణలో ఉండగా 162 మంది మరణించారని, వారికి ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. మహిళా పోలీసులను మహిళా సంరక్షణ కార్యదర్శిగా విధుల్లోకి తీసుకున్నారని, తిరిగి వారిని పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేస్తున్నామని ప్రకటించారని వివరించారు. వారంతా వయస్సు, ఆరోగ్యరీత్యా పోలీసుశాఖలో విధులు నిర్వహించలేమని చెప్పారన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశాభావంతో ఉన్నామన్నారు. అనంతరం కొండారెడ్డి నరహరిని సంఘం నేతలు సన్మానించి, వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఐటీ, కమ్యూనికేషన్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌కు ఉద్యోగుల తరపున శుభాకాంక్షలు తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్, రాష్ట్ర కోశాధికారి బి.పాండురంగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేశ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సుదర్శన్‌రాజ్, జాయింట్ సెక్రటరీ శశికళ పాల్గొన్నారు.

ప్రజాపాలనకు రాజ్యాంగ పీఠిక ప్రచారోద్యమం

దారిదీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ

విశాలాంధ్ర-తణుకు: రాజ్యాంగ పీఠిక చిన్నదిగా కనిపించినా అది మాత్రం రాజ్యాంగంలోని అంతస్సారాన్ని వ్యక్తీకరిస్తోందని దారిదీపం సంపా దకులు డీవీవీఎస్ వర్మ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు సురాజ్య భవనంలో ఆదివారం 'దారిదీపం మిత్రుల సమాలోచన సభ' జరిగింది. వర్మ మాట్లాడుతూ... దేశంలో అందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను, మత విశ్వాస స్వేచ్ఛను, అందరికీ అవకాశాల సమానత్వాన్ని ప్రకటిస్తూ జాతీయ ఐక్యత, సమగ్రతను, ప్రజల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పీఠిక దేశ ప్రజలకు వాగ్దానం చేసిందన్నారు. నిజమైన ప్రజా పాలన అంటే రాజ్యాంగ పీఠికను అమలు చేయడమేనని పేర్కొన్నారు. రాజ్యాంగ పీఠిక ఆధారంగా సాగే ప్రజా పాలన కోసం పౌరసమాజాన్ని, శ్రామిక ప్రజలను జాగృతం చేయడం కోసం 'రాజ్యాంగ పీఠిక ప్రచార ఉద్యమం' సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రాజ్యాంగ పీఠిక పరిచయ కార్యక్రమాలను విద్యా సంస్థల సహకారంతో, విద్యార్థుల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు ప్రారంభించాలని కోరారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవాన్ని కార్మిక సంఘాలు, కుల వృత్తి సంఘాలు, వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న దళిత, బహుజన, మహిళా సంఘాలు, వివిధ తరగతుల ప్రజా సంఘాలు సంయుక్తంగా సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని సమానత్వాన్ని సాధించే 'పీఠిక దీక్ష' దినంగా పాటించాలని వర్మ పిలుపునిచ్చారు. రాజ్యాంగ పీఠిక పాలకుల ఆచరణకు, ప్రచారాలకు గీటురాయి కావాలని దానికోసం పౌరసమాజం గళం విప్పాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకుడు, విశ్రాంత ఐఏఎస్ బండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ జిల్లాల ప్రముఖులు, ప్రజా సంఘాల ప్రతినిధులు , వాపక్ష పార్టీల మిత్రులు హాజరయ్యారు.

'భారత రాజ్యాంగ పీఠిక' పుస్తకావిష్కరణ

ప్రముఖ న్యాయ నిపుణులు మాడభూషి శ్రీధర్ రాసిన 'భారత రాజ్యాంగ పీఠిక' పుస్తకాన్ని రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభ్యురాలు సంకు మనోరమ ఆవిష్కరించారు. తొలి ప్రతిని రాష్ట్ర సామాజిక పోరాట సమితి నాయకులు పేరూరి మురళీకుమార్‌కు అందజేశారు. అనంతరం "బహుళ సంస్కృతి పై హిందూత్వ దాడి-ప్రత్యామ్నాయాలు" అనే అంశంపై జరిగిన రెండవ సదస్సులో ప్రముఖ జర్నలిస్టు మందలపర్తి కిషోర్ అధ్యక్షత వహించగా ప్రత్యామ్నాయ సాంస్కృతిక ఉద్యమ నేత కె శాంతారావు, ప్రజానాట్యమండలి నాయకులు డాక్టర్ సి.స్టాలిన్ , మాజీ జడ్జి లక్ష్మి, సామాజిక ఉద్యమకారులు హైమావతి, వావిలాల సరళాదేవి అమీనా బేగం పాల్గొన్నారు. డాక్టర్ హుస్సేన్, డాక్టర్ కృష్ణమోహనరావు, డాక్టర్ సత్య నారాయణ, డాక్టర్ కృష్ణారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్స్ శ్రీనివాస ప్రసాద్, అడాల సత్య నారాయణ, సీనియర్ జర్నలిస్టులు రత్న రాజు, డి.రామకృష్ణ, న్యాయవాదులు పీవీ శాస్త్రి, అంబేద్కర్ , పొట్ల సురేష్, సీపీఐ నేత బొద్దాని నాగరాజు, నామన వెంకటేశ్వర రావు, గార ప్రసాద్, సీపీఎం నాయకులు పీవీ ప్రతాప్, పీ దక్షిణామూర్తి, రైతు కూలీ సంఘం నేత కోటిరెడ్డి, బాషా, బీఎస్పీనేత మధు , కాంగ్రెస్ నేత రామారావు , మానవత జానకి రామ రాజు , మందలపర్తి హరీష్ ,మొగళ్ళపు వెంకటేశ్వరరావు, జానపద కళాకారుడు ఎల్ఆర్ కృష్ణ బాబు పాల్గొన్నారు. కాగా, డీవీవీయస్ వర్మ 79వ పుట్టినరోజును పురస్కరించుకొని జరిపిన ఆత్మీయ సభకు ప్రముఖ పాత్రికేయులు డీ సోమసందర్ అధ్యక్షత వహించగా అనేకమంది మిత్రులు శుభాకాంక్ష సందేశాలిచ్చారు .

క్రీడారంగంపై దృష్టిపెట్టండి

పవన్‌తో ప్రముఖ క్రీడాకారుల భేటీ... బలోపేతానికి సూచనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో గాడి తప్పిన వ్యవస్థలను దారిలో పెట్టడానికి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రణాళిక రూపొందిస్తున్నారు. క్రీడా సంఘాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రాన్ని అమితంగా ఇష్టపడే మేధావులు, ప్రముఖులు, వాణిజ్యవేత్తలు, క్రీడాకారులు పవన్‌ను కలిసి అనేక సూచనలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, ఢిల్లీకి చెందిన క్రీడాకారులు కలిసిన వారిలో ఉన్నారు. ప్రముఖ క్రికెటర్ హనుమ విహారి... రాష్ట్ర క్రీడారంగాభివద్ధికి దోహదపడే అనేక విషయాలను ప్రస్తావించారు. క్రీడా సంఘాలు బాగుపడితేనే అత్యుత్తమ క్రీడాకారులు రూపొందుతారని, దానికి సరైన మార్గదర్శనం చేసేవారు అవసరమని పవన్‌కు వివరించారు. క్రీడలతో సంబంధంలేని వారి చేతికి క్రీడా సంఘాలను అప్పగించవద్దని సూచించారు. క్రీడారంగం గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో అథోగతి పాలైందన్నారు. క్రికెట్‌లో అనుభవం ఉన్నవారికే క్రికెట్ సంఘం బాధ్యతలు అప్పగించాలని, కబడ్డీ ఆటపై పట్టు ఉన్నవారికే కబడ్డీ సంఘాన్ని కేటాయించాలని, ఇదే పద్ధతి అన్ని సంఘాలలో అమలు చేస్తే ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో అగ్రగామిగా నిలుస్తుందని సూచించారు. కొన్ని క్రీడా సంఘాలు రాజకీయ ఉపాధి ఆవాస కేంద్రాలుగా మారిపోవడం వల్ల క్రీడాకారులకు ఇచ్చే ధ్రువీకరణ పత్రాలు అంగడి సరుకుగా మారిపోయాయని చెప్పారు. దానివల్ల ఎలాంటి క్రీడానుభవం లేనివారు క్రీడాకారుల కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో సీట్లు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడా సంఘాలలో తిష్టవేసిన రాజకీయ నాయకులు...క్రీడాకారుల ఎంపికలో తమ బంధువులు, సన్నిహితుల పిల్లలను వారి అధికార దర్పంతో ఎంపిక చేయిస్తున్నారనీ ఫలితంగా పోటీలలో వారు నిలబడలేకపోతున్నారని తమ బాధను వెలిబుచ్చారు. క్రీడా సంఘాల నిధులు దోపిడీకి గురవుతున్నాయనీ, క్రీడా సంఘాలలో క్రీడానుభవం లేని రాజకీయనాయకులకు ప్రవేశం లేకుండా చూడాలని కోరారు.

రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని వారు ముందుకు వచ్చారు. క్రీడాకారుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు విన్న పవన్ స్పందిస్తూ, ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం క్రీడా సంఘాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, క్రీడలకు వైభవాన్ని తప్పకుండా తీసుకు వస్తామని క్రీడాకారులకు పవన్ భరోసా ఇచ్చారు.

నేత్ర వైద్యాధికారుల రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవం

విశాలాంధ్ర-పార్వతీపురం: నేత్ర వైద్య అధికారుల రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రెసివ్ ఆప్తమాలమిక్ ఆఫీసర్స్ ఫెడరేషన్ అసోసియేషన్ ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు ప్రసన్నకుమార్, బాలగంగాధరరాజు ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ప్రక్రియలో ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేయుచున్న నేత్ర వైద్య అధికారులంతా రాష్ట్ర సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ రోణంకి వెంకటరమణ (శ్రీకాకుళం), కార్యదర్శిగా డాక్టర్ జీరు నగేష్ రెడ్డి (పార్వతీపురం) ఉపాధ్యక్షుడిగా డాక్టర్ మనీష్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా సత్యనారాయణ, కోశాధికారిగా రామచంద్రరావు, సంయుక్త కార్యదర్శులుగా లక్ష్మీనారాయణ మూర్తి,సుధాకరరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా హెరాల్డ్, ఇందిరా, రమేష్ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. వివరాలను కార్యదర్శి నగేష్ రెడ్డి (పార్వతీపురం మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి) ఆదివారం వెల్లడించారు.

'నీట్' రద్దు కోరుతూ

4న దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

- ఎన్ఈపీ-2020 రద్దుకు అన్ని రాష్ట్రాలు తీర్మానం చేయాలి
- ఏఐఎస్ఎఫ్ నూతన జాతీయ అధ్యక్షుడిగా విరాజ్ దేవాంగ్
- జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్ శ్రీరంగరాజ్ వెల్లడి

దినేశ్ శ్రీరంగరాజ్

విశాలాంధ్ర-తిరుపతి: వైద్య విద్య ప్రవేశ పరీక్ష 'నీట్' రద్దు కోరుతూ జులై 4వ తేదీన దేశ వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్ శ్రీరంగరాజ్ తెలిపారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ సమితి సమావేశాలు జూన్ 28, 29 తేదీల్లో బైరాగపట్టడిలోని గంధమనేని శివయ్య భవన్‌లో జరిగాయి. జాతీయ సమితిలో తీసుకున్న నిర్ణయాలపై దినేశ్ శ్రీరంగరాజ్ మాట్లాడుతూ ఈ సమావేశాల్లో నూతన జాతీయ అధ్యక్షుడిగా మహారాష్ట్రకు చెందిన విరాజ్ దేవాంగ్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న మార్పులు, సమస్యలపై చర్చించి తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 'నీట్' అంశంపై ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన నీట్ ప్రశ్నా పత్రం లీక్ అవడం వలన 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారం అయిందని, ప్రశ్నా పత్రాల లీకేజీలపై పార్లమెంటులో చర్చ చేయడానికి బీజేపీ ప్రభుత్వం అనుమతించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ప్రశ్నా పత్రాలు వరుసగా లీకేజీలవుతున్నా ఎందుకు ఎన్‌టీఏను ప్రక్షాళన చేయలేదని ప్రశ్నించారు. 'నీట్' పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని కోరుతూ జులై 4న దేశవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తామని, వామపక్ష ప్రగతిశీల విద్యార్థి సంఘాలు ఉమ్మడిగా సంపూర్ణ మద్దతు తెలియజేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయాలు రాజకీయ కేంద్రాలుగా పని చేస్తున్నాయని, విశ్వవిద్యాలయాల పరిరక్షణ కోసం 'సేవ్ యూనివర్సిటీ-సేవ్ డెమొక్రసీ' పేరుతో ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. 'నీట్' పరీక్షను రద్దు చేయాలని తమిళనాడు అసెంబ్లీ తరహాలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని, అలాగే నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) రద్దుకు కూడా తీర్మానం చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి డిమాండ్ చేస్తోందన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి కార్యదర్శి కె.శివారెడ్డి, సంఘమిత్ర, కబీర్, అమీన్, మహేష్ కుంజం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి పాల్గొన్నారు.

భారత జట్టుకు పవన్ కల్యాణ్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రెండవసారి టీ20 ప్రపంచకప్ గెలుచుకుని విశ్వవిజేతగా నిలచిన భారత క్రికెట్ జట్టుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదివారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను నిలబెడుతూ రోహిత్ సేన సాధించిన విజయం చరిత్రలో నిలచిపోతుందని, దక్షిణాఫ్రికాతో జరిగిన తుదిపోరులో జట్టు మొత్తం సమష్టిగా రాణించిన తీరు అద్భుతం అని పేర్కొన్నారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన ఆటలో ఒత్తిడిని జయించి సగర్వంగా ప్రపంచకప్ సాధించి పెట్టిన భారత క్రికెటర్లకు పేరు పేరునా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'మీ విజయం భవిష్యత్ తరాలకు స్ఫూర్తి దాయకంమని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ క్రికెట్‌లో భారత్ మరిన్ని విజయాలు అందుకోవాలని' ఆకాంక్షించారు.

చల్లా శ్రీనివాసులుశెట్టికి పవన్ ప్రశంసలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులుశెట్టి పేరును ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బోర్డు సిఫార్సు చేయడం తెలుగువారందరికీ గర్వ కారణమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఈ మేరకు శ్రీనివాసులుశెట్టికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆయన నేతృత్వంలో ఎస్‌బీఐ మరెన్నో మైలురాళ్లు అందుకోవాలని, క్షేత్ర స్థాయిలో రైతులు, రైతు కూలీలు, చిరు వ్యాపారుల సాదకబాధకాలు తెలిసిన శ్రీనివాసులుశెట్టి, ఆయా వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకొనేలా బ్యాంకింగ్ సేవలు మరింతగా విస్తరింప చేయాలని కోరారు.

విశాఖ నుంచే ప్రారంభిస్తాం

మహిళలకు ఉచిత బస్సు పథకంపై మంత్రి మండిపల్లి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ మేరకు మహిళల కోసం ఉచిత బస్సు పథకాన్ని విశాఖ నుంచే ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేస్తున్న తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేస్తామన్నారు. త్వరలోనే ఈ పథకం ప్రారంభ తేదీని ప్రకటిస్తామని చెప్పారు. మంత్రి ఆదివారం విశాఖ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మహిళలకు కల్పించడంలో ఎదురయ్యే సమస్యలపై చర్చిస్తున్నట్లు వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా విలీనం చేయలేదని, జీతాలు ఇచ్చేది ప్రభుత్వమే అయినా కార్పొరేషన్ పేరిట దోచుకున్నారని ఆరోపించారు. రోడ్డు రవాణా సంస్థ ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడతామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాయలసీమలో పెద్దిరెడ్డి కుటుంబం... మాఫియాగా తయారైందన్నారు. రాష్ట్రంలో ఎక్కువ ఖనిజ సంపద కొలగొట్టింది పెద్దిరెడ్డి కుటుంబమేనని ఆరోపించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి తనపై అవాకులు చవాకులు పేలుస్తున్నారని, ఏపీలో అన్యాయం జరిగినటు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిథున్ రెడ్డి కుటుంబ చరిత్ర అందరికీ తెలుసని, వారు చేసిన అన్యాయాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

బంగ్లాదేశ్ ఛటోగ్రామ్‌కు ఐఎన్ఎస్ రణవీర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో ఈస్టర్న్ ఫ్లీట్‌కు చెందిన భారత నౌక 'ఐఎన్ఎస్ రణ్‌వీర్' కార్యాచరణ విస్తరణలో భాగంగా బంగ్లాదేశ్‌లోని ఛటోగ్రామ్‌కు చేరుకుంది. నౌకకు బంగ్లాదేశ్ నావికాదళం ఘనస్వాగతం పలికింది. బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా... జూన్ 21, 22 తేదీల్లో భారతదేశంలో పర్యటించిన తర్వాత ఈ నౌక సందర్శనకు వెళ్లడం గమనార్హం. భారతదేశం-బంగ్లాదేశ్ నౌకాదళాల సిబ్బంది సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ ఎక్స్ఛేంజ్, క్రాస్-డెక్ విజిట్‌లు, కమ్యూనిటీ ఔట్రీచ్, స్నేహపూర్వక స్పోర్ట్స్ ఫిక్చర్‌లతో సహా విస్తృతమైన వృత్తిపరమైన పరస్పర సహాయక చర్యల్లో పాల్గొంటారు. నౌకాశ్రయం పూర్తయిన తర్వాత బంగ్లాదేశ్ నౌకాదళానికి చెందిన నౌకలతో ఐఎన్ఎస్ రణవీర్ మారిటైమ్ పార్టనర్‌షిప్ వ్యాయామంలో పాల్గొంటుంది. ఈ పర్యటన దీర్ఘకాల స్నేహాన్ని, సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుంది. అలాగే ఈ ప్రాంతంలోని అందరికీ భద్రత, అభివృద్ధి (సాగర్)పై భారత ప్రభుత్వం దృష్టి సారించి పరస్పర కార్యకలాపాల శ్రేణి ద్వారా ఇరు దేశాల మధ్య బలమైన బంధం ఉంటుంది. ఐఎన్ఎస్ రణవీర్ అనేది రాజ్‌పుత్ క్లాస్ గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్. ఇది అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్‌లతో అప్‌గ్రేడ్ చేయబడింది. ఎక్కువ భాగం స్వదేశీవి కావడం వల్ల ఆత్మనిర్భర్‌పై భారత నావికాదళం దృఢమైన దృష్టిని పునరుద్ఘాటిస్తుంది.

సోమవారం
01-07-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 10
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఫ్రాన్స్‌లో సార్వత్రిక ఎన్నికలు

పారిస్: ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికలు మొదలయ్యాయి. ఆదివారం తొలి దశ ఓటింగ్ జరిగింది. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పోలింగ్ సాగింది. జులై 7న మలిదశ ఓటింగ్ జరగబోతోంది. 4.9 కోట్ల మంది అర్హులైన ఓటర్లు దేశంలో ఉన్నారు. జూన్ ఆరంభంలో జరిగిన యూరోపియన్ పార్లమెంటు ఎన్నికల్లో నేషనల్ ర్యాలీ (ఆర్ఎన్) నెగ్గింది. అధికార పార్టీ ఓడిపోయింది. దీంతో ఎన్నికలను అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ ప్రకటించారు. పార్లమెంటులో మెజారిటీ సాధించే అవకాశం ఆర్ఎన్‌కు ఉన్నట్లు ఎన్నికల పరిశీలకులు అన్నారు. వామపక్ష సంఘటనలో భాగంగా న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) కూడా పోటీలో నిలిచింది. కాగా, మాక్రాన్‌కు చెందిన రినైజెన్స్ పార్టీ మూడవ స్థానంలో ఉన్నట్లు ప్రీ-పోల్ సర్వేలు పేర్కొన్నాయి.

నేడు సామాజిక పెన్షన్ల పంపిణీ

- ఉదయం 6 గంటల నుంచే ప్రారంభం
- సచివాలయ ఉద్యోగులు సన్నద్ధం
- 65,18,496 మందికి లబ్ధి
- మంగళగిరిలో చంద్రబాబు అందజేత

5లో

ఉపేంద్ర ద్వివేది బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: భారత ఆర్మీ స్టాఫ్ చీఫ్ (సీఓఏఎస్)గా జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2022 మేలో ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన జనరల్ మనోజ్ పాండే పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానాన్ని భర్తీ చేశారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది ఇంతకు ముందు ఆర్మీ స్టాఫ్ వైస్ చీఫ్‌గా ఉన్నారు. పరమ విశిష్ట సేవా పతకం, అతి విశిష్ట సేవా పతకం, మూడు జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్‌ఛార్జ్ కమెండేషన్ కార్డ్‌లను ఆయన అందుకున్నారు. కాగా, మధ్యప్రదేశ్‌కు చెందిన ఉపేంద్ర ద్వివేది, సైనిక్ స్కూల్ రేవాలో

- మిగతా 5 లో

'నీట్'పై కేంద్రం దిద్దుబాట!

- కేంద్రం కసరత్తు
- ప్రశ్నపత్రాల లీకేజీల కట్టడికి 'సీబీటీ' యోచన
- అదే పద్ధతిలో సీఎస్ఐఆర్ -యూజీసీ నెట్ పరీక్షలు



5లో

నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ, ఫలితాల్లో అవకతవకలు జరగడం దేశంలో అలజడి సృష్టించింది. పరీక్షా విధానాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిలదీశారు.

రంగంలోకి విదేశీ నిపుణులు

పోలవరం ప్రాజెక్ట్ పరిశీలన
అధికారులతో చర్చలు

విశాలాంధ్ర-పోలవరం : పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని నలుగురు సభ్యులతో కూడిన అంతర్జాతీయ నిపుణుల బృందం ఆదివారం పరిశీలించింది. ఉదయం 10.30 గంటలకు రాజమండ్రి నుంచి ప్రాజెక్టు ప్రాంతానికి వారు చేరుకున్నారు. మెగా ఇంజనీరింగ్ అతిథి గృహంలో ప్రాజెక్టు ఇరిగేషన్ అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం స్పిల్ వే 23వ బ్లాక్ వద్ద మ్యాప్ పాయింటింగ్ ద్వారా సీడబ్ల్యూసీ సీఈ అశ్విన్ కుమార్ వర్మ స్పిల్ వే వివరాలను బృందానికి వివరించారు. స్పిల్ వే అతి సమీపంలో కట్టిన గైడ్ బండ్ ఎందుకు కుంగిపోయింది, గైడ్ బండ్ కట్టిన విధానాన్ని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలను పరిశీలన చేసి ఎగువ కాఫర్ డ్యాం నుంచి ఎన్ని చోట్ల సీపేజీ వస్తుందని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. 17 చోట్ల సీపేజీ వచ్చిందని, 15 చోట్ల పూర్తి చేశామని, ఇంకా రెండు చోట్ల పూర్తి చేయవలసి ఉందని తెలిపారు. ఎగువ కాఫర్ డ్యాం కట్టడంలో నాణ్యతా లోపమా, కట్టడంలో లోపమా అనే విషయాలపై ఎగువ కాఫర్ డ్యాంకు ఉపయోగించిన మట్టి, రాయిని మిషన్ ద్వారా కాఫర్ డ్యాం అడుగుభాగం నుంచి తీసి నమూనాలను ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. డయాఫ్రమ్ వాల్ ప్రాంతంలో పని చేస్తున్న వైబ్రో కాంప్రెషన్ పనుల నాణ్యత పరిశీలించారు. డయాఫ్రమ్ వాల్ పూర్తిగా దెబ్బతిన్నదా లేదా పాక్షికంగా దెబ్బతిన్నదా అనే దానిపై పరిశీలన చేపడతామన్నారు. పనుల పురోగతిపై అధ్యయనం చేసి మరో రెండు రోజుల ప్రాజెక్టును క్షుణ్ణంగా పరిశీలించి పోలవరం అథారిటీ సభ్యులు కేంద్ర జల సంఘం నిపుణులు, బావర్, కెల్లర్, మెగా అంతర్జాతీయ డిజైన్ సంస్థతో బృందం చర్చిస్తారని ఇంజనీర్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో ఏర్పడిన సమస్యలను పరిష్కరించడానికి అంతర్జాతీయ నిపుణులు అవసరమని కేంద్ర జల సంఘం నిర్ణయించిన క్రమంలో ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడానికి అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం డిజైన్ సంస్థ అఫ్రి సాయం తీసుకుంటున్నారు. దీనిలో భాగంగానే అమెరికాకు చెందిన డేవిడ్ బి పాల్, గియస్ ఫ్రాంకో డి సిస్కో, సీన్ హించ్ బెర్గర్, కెనడాకు చెందిన రిఛార్డ్ డొన్నెల్లి నియమితులయ్యారు. పోలవరం ప్రాజెక్టులో సవాళ్లకు సంబంధించిన కీలక అంశాల్లో వీరంతా నిపుణులు. అంతర్జాతీయ డ్యాం భద్రత నైపుణ్యం స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ సొల్యూషన్స్, సివిల్ ఇంజనీరింగ్, హైడ్రాలిక్ నిర్మాణాలు, జియో టెక్నికల్ ఇంజనీరింగ్ వంటి అంశాలలో వీరికి అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం ఉండడంతో వీరిని ఎంచుకున్నట్లు కేంద్ర జల సంఘం పేర్కొంది.

డీఎస్సీపై ఉత్కంఠ

- వయోపరిమితి, పోస్టుల సంఖ్య పెరిగేనా?
- జీవో 117 రద్దు చేసేనా?
- అభ్యర్థుల ఆందోళన బాట
- నేడు నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: ఏపీ డీఎస్సీ, ఏపీ టెట్ నోటిఫికేషన్లను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేయనుంది. ప్రధానంగా డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెరుగుతుందా?, వయోపరిమితి సడలింపును నిరుద్యోగులు కోరుకున్న విధంగా 48 ఏళ్ల వరకు జనరల్ అభ్యర్థులకు(ఓసీ) పొడిగిస్తారా లేదా? అనే అంశాలపై నోటిఫికేషన్లో స్పష్టత రానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ పోస్టుల భర్తీకి అవసరమైన విధి విధానాల దస్త్రాలపై అటు సీఎం చంద్రబాబు, ఇటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తొలి సంతకాలు చేశారు. డీఎస్సీలో కూటమి ప్రభుత్వం 16,347 పోస్టులను ప్రకటించింది. గత వైసీపీ ప్రభుత్వ చివరి దశలో 6,100 డీఎస్సీ పోస్టులకు నోటిఫికేషన్ జారీజేయగా, ఎన్నికల కారణంగా ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ పోస్టులకు దాదాపు 10వేలకుపైగా కలిపి మొత్తంగా 16,347 పోస్టులను ప్రకటించడంపై నిరుద్యోగులు సంతృప్తి చెందడం లేదు. ఎన్నికలకు ముందు మెగా డీఎస్సీ ద్వారా 35వేలకుపైగా పోస్టులను భర్తీ చేస్తామని టీడీపీ, జనసేన నేతలు హామీ ఇచ్చి... కేవలం 10వేల పోస్టులే పెంచి సరిపెట్టడాన్ని తప్పుపడుతున్నారు. ప్రకటించిన పోస్టుల్లో ఐదారు జిల్లాలకు పైగా ఎస్జీటీ పోస్టులు చాలా తక్కువగా ఉండటంపైనా అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతో అనంతపురం, ప్రకాశం, శ్రీకాకుళం తదితర జిల్లాలకు చెందిన అభ్యర్థులు మంత్రి లోకేశ్‌ను కలిసి ఎస్జీటీ పోస్టులు పెంచాలని విన్నవించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అనంతపురంజిల్లాలో ఎస్జీటీ అభ్యర్థులు రోడ్డెక్కారు. డీఎస్సీలో అనంతపురం జిల్లాకు ఎస్జీటీ పోస్టుల సంఖ్య పెంచాలని నిరసించారు. దీంతో ఎస్జీటీ పోస్టులు పెరుగుతాయా? లేదా? అనే దానికి నేటితో తెరపడనుంది. డీఎస్సీ జనరల్ అభ్యర్థులకు(ఓసీ) ప్రస్తుతమున్న 44 ఏళ్ల వయోపరిమితిని 48 ఏళ్ల వరకు పొడిగించాలని కోరుతున్నారు. ఆరు సంవత్సరాల నుంచి డీఎస్సీ

- మిగతా 5 లో

ఏపీకి ప్రత్యేక హోదా కోరాలి

నితీశ్ కుమార్‌తో కలిసి కేంద్రంపై ఒత్తిడి తేవాలి
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ : ఏపీకి ప్రత్యేక హోదా సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉందన్నారు. రాష్ట్ర విభజన కాలంలో పార్లమెంటు సాక్షిగా ప్రకటించిన విభజన చట్టం హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోదీ తిరుపతి వెంకన్న సాక్షిగా ఏపీకి 10 ఏళ్లు ప్రత్యేక హోదా ఇస్తామన్న వాగ్దానం నీటిమూటగానే మిగిలిందని విమర్శించారు. తదుపరి కాలంలో విభజన చట్ట హామీల అమలు కూడా కేంద్రం నిలిపేసిందన్నారు. 10 ఏళ్లుగా వివిధ సందర్భాల్లో ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు కోసం ఉద్యమాలు జరుగుతున్నప్పటికీ కేంద్రంలోని మోదీ సర్కార్ తనకేమీ పట్టనట్లు వ్యవహరించిందని ధ్వజమెత్తారు. ఆఖరుకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఆవశ్యకతను గుర్తించిన గత ప్రభుత్వాలు అసెంబ్లీలో తీర్మానం చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. ప్రస్తుతం కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధానిగా ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి 16 ఎంపీ స్థానాలతో తెలుగుదేశం, 12 ఎంపీ స్థానాలతో జేడీ(యూ) మద్దతిస్తున్నాయన్నారు. మోదీ ప్రభుత్వ మనుగడకు టీడీపీ, జేడీ(యూ) పార్టీలు ఎంతో కీలకం అన్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ భాగస్వామ్య పార్టీ అయిన జేడీ(యూ) బీహార్‌కు ప్రత్యేక తరగతి హోదా లేదా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కోసం డిమాండ్ చేస్తూ తీర్మానం చేసిందని పేర్కొన్నారు. తమ మద్దతుతోనే ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతుందన్న విషయాన్ని గ్రహించిన బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఒకవైపు కేంద్రంతో సఖ్యతగా మెలుగుతూనే, బీహార్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ కేంద్రంపై ఒత్తిడి పెంచనున్నట్లు తెలుస్తోందని స్పష్టం చేశారు. అందువల్ల ఏపీ అభివృద్ధి కోసం ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలుకు, రాష్ట్రానికి దక్కవలసిన నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో కీలక భూమిక పోషిస్తున్న చంద్రబాబు ఏపీకి ప్రత్యేక హోదా సాధన కోసం నడుంకట్టి, కేంద్రంపై ఒత్తిడి పెంచాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

పాత డీఎస్సీ రద్దు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు ప్రకటించిన డీఎస్సీ-2024ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. జులై 1వ తేదీన కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో ఈ

- మిగతా 5 లో

అక్టోబరులో అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీల మహాసభ

5లో

ఇదీ లోకం!

కంప్యూటర్‌కే క్యూ!

- పెరగనున్న ఇంజినీరింగ్ సీట్లు
- ఏఐసీటీఈకి భారీగా దరఖాస్తులు
- యాజమాన్య కోటా ఫీజుల దందా
- ఇతర రాష్ట్రాలకు విద్యార్థులు
- నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్ రిజిస్ట్రేషన్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఇంజినీరింగ్ సీట్ల పెంపు అనుమతి కోసం అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ)కి భారీగా కళాశాలల యాజమాన్యాలు దరఖాస్తు చేశాయి. అందులో అత్యధికంగా కంప్యూటర్ బ్రాంచి సీట్లకే మొగ్గు చూపినట్లు సమాచారం. ఆయా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బంది, క్యాంపస్ నియామకాలు తదితర అంశాలపై వస్తున్న విమర్శలపై యాజమాన్యం మౌనంగా

- మిగతా 5లో

మోదీ దురహంకారి

- ప్రజలు తిరస్కరించినా వాస్తవం బోధపడలేదు
- ముస్లింలను అవమానించినందుకు పౌరులందరికీ క్షమాపణ చెప్పాలి
- ఆర్థికవేత్త అమర్త్యసేన్

న్యూఢిల్లీ: విద్వేషాన్ని నూరిపోసేందుకు చేసిన ప్రయత్నానికిగాను దేశ పౌరులకు ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణలు చెప్పాలని ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ డిమాండ్ చేశారు. ది వైర్ కోసం కరన్ థాపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... 'అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన విద్వేష రాజకీయాలకు పదును పెంచారు. ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొట్టేందుకు ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోలేదు. తాజా సార్వత్రిక ఎన్నికల ప్రచారంలోనూ అతిపెద్ద మైనారిటీ వర్గంపై విషం కక్కారు. విభజనవాదాన్ని ప్రోత్సహించారు. ప్రజలను రెచ్చగొట్టేలా విద్వేషపూరిత ప్రసంగాలు చేశారు' అంటూ మోదీ తీరును అమర్త్యసేన్ ఆక్షేపించారు. విద్వేషాన్ని నూరిపోసేందుకు చేసిన ప్రయత్నానికిగాను దేశ

- మిగతా 5 లో

వణికిస్తున్న డెంగీ

- పెరుగుతున్న కేసులు
- మన్యంలో పొంచిఉన్న ముప్పు
- ప్రైవేట్ ఆసుపత్రుల్లో దోపిడీ
- రోగుల నుంచి లక్షల్లో వసూళ్లు?

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: డెంగీ జ్వరాలు రోజురోజుకూ విజృంభిస్తుండడంతో అనేకమంది ఆసుపత్రి పాలౌవుతున్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభంతోనే విశాఖ నగరంతో పాటు రాష్ట్రంలో అనేక పట్టణాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో దోమల బెడద అధికమైంది. ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్క విశాఖలోనే 250 కేసుల వరకు నమోదైనట్లు తెలుస్తోంది. పల్లెల్లో డెంగీ ముప్పు పొంచి ఉంది. కేసుల తీవ్రత అధికంగా ఉంటుందని తెలుస్తోంది. దేశంలో డెంగీ అధికంగా ఉన్న రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు డెంగీ తీవ్రతపై ప్రపంచ ఆరోగ్యసంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. డెంగీలోని నాలుగు ప్రధాన వేరియంట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనే కనిపిస్తున్నాయని వెల్లడించింది. ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు పెద్ద ఆసుపత్రి అయిన కేజీహెచ్‌లో డెంగీ రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. డెంగ్యూ పరీక్షల కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూలు కడుతున్నారు. డీఈఎన్‌వీ 1, డీఈఎన్‌వీ 2, డీఈఎన్‌వీ 3, డీఈఎన్‌వీ 4 ప్రభావం ఎక్కువగా ఉంటున్నట్టు డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది. కొన్నిసార్లు రెండుమూడు వేరియంట్లు కూడా ఒకేసారి దాడి చేసే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించింది. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రుల్లో అవసరమైన కిట్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించింది.

ఈ ఏడాది ఇప్పటివరకు వందలాది డెంగీ కేసులు వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మన్యంలో డెంగీ తీవ్రత అధికంగా ఉంది. డెంగీ నిర్ధారణలో వైద్య పరీక్షలే కీలకం. కేవలం ప్లేట్‌లెట్ కౌంట్, డెంగీ స్ట్రిప్ టెస్ట్, సీరమ్ టెస్ట్ వంటి వాటితో దీనిని నిర్ధారించడం

- మిగతా 5 లో

లోతైన పరిశోధన కొలకలూరి 'పత్రత్రయి'

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
సెల్: 9440222117

'జానపద విజ్ఞానానికి ప్రపంచమంత ప్రాచీనత ఉన్నా ఈ పేరుతో ఈ ఆలోచనకు ఒకటిన్నర శతాబ్ది కూడా దాటలేదు' (పత్రత్రయి: పు- 74)



పత్రత్రయి అంటే మూడు పత్రాలు. పత్రం అంటే పరిశోధన పత్రం. మూడు పరిశోధన పత్రాల సంపుటి, కొలకలూరి ఇనాక్‌గారి 'పత్రత్రయి'. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1974- 83 మధ్య నిర్వహించిన మూడు విశిష్ట సదస్సుల కోసం ఆచార్య కొలకలూరి రాసిన, సమర్పించిన మూడు పరిశోధన పత్రాలు ఈ పత్రత్రయి. అవి ఇవి.

1. నూరేళ్ల తెలుగు వ్యాసం అనే అంశం మీద 1974 లో అకాడమీ నిర్వహించిన సదస్సులో కొలకలూరి తెలుగు వ్యాస పరిణామం (1947-72) అనే పత్రం సమర్పించారు.

2. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ రజతోత్సవాల సందర్భంగా 1977 లో జరిగిన సదస్సులో కొలకలూరి "తెలుగు సాహిత్య విమర్శనం (1966-76) అనే పత్రం సమర్పించారు.

3. 1983 లో జరిగిన పరిశోధన సదస్సులో కొలకలూరి "తెలుగు జానపద సాహిత్య పరిశోధన" (1842- 1982) అనే పత్రం సమర్పించారు. ఈ మూడు పత్రాలకు కాలం ఒక పరిమితిగా ఉంది.

పరిశోధన పత్రం అంటే ఒక నిర్దిష్ట సాహిత్యం మీద సమగ్రమైన పరిశోధన చేసి, సాధికారికంగా రాసిన పత్రం ఆచార్య కొలకలూరి కథానికలలో లాగే ఆయన పరిశోధన పత్రాలలో కూడా ఒక నిండుతనం ఉంటుంది. ఆయన నిఖార్సైన పరిశోధకులు.

తెలుగు వ్యాస పరిణామము మీద అప్పుడప్పుడే పరిశోధన చేసి ఉన్న ఆచార్య కొలకలూరి భారత స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా 1947- 72 మధ్య 25 ఏళ్లలో తెలుగు వ్యాసం పోయిన పోకడలను లోతుగా అధ్యయనం చేశారు. తెలుగులో వ్యాసం ఆంగ్ల సాహిత్య ప్రభావంతోనే పుట్టిందని, ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులో మొదట పుట్టిన ప్రక్రియ వ్యాసమేనని స్పష్టం చేశారు. నిజానికి వ్యాసం పుట్టుకతో సృజన ప్రక్రియ కాగా, తెలుగులో అది సాహిత్య విమర్శకు పర్యాయపదం అయిపోయిందని పేర్కొన్నారు. తెలుగులో వ్యాసం సృజన వ్యాసంగాను, విమర్శ వ్యాసంగాను అభివృద్ధి చెందిందంటూ, సృజన వ్యాసం తొలినాళ్లలో గ్రాంథిక భాషలోనూ, విమర్శ వ్యాసం వ్యావహారిక భాషలోనూ అభివ్యక్తమైందని గుర్తించారు. సృజన వ్యాసం యుగ, స్త్రీ, పత్రిక, వివాద- అనే నాలుగు రకాలుగా అభివృద్ధిచెందగా, విమర్శ వ్యాసం కావ్యతత్వ, కావ్యాత్మ, కావ్యగుణ, కావ్య చరిత్రాది 15 విభాగాలుగా వికసించిందని కొలకలూరి పేర్కొన్నారు. ఈ వింగడింపులు, వాటి వివరణలు, వాటికి కొలకలూరి ఇచ్చిన ఉదాహరణలు ఆయన తెలుగు వ్యాస సాహిత్యాన్ని ఎంత విస్తృతంగా అధ్యయనం చేశారో తెలియజేస్తాయి.

చలం, శ్రీశ్రీ, నార్ల, లత, సంజీవదేవ్, తిరుమల రామచంద్ర వంటి అనేకుల వ్యాస రూపసారాలను కొలకలూరి ఆసక్తికరంగా వివరించారు. "నార్ల వ్యాసాలలో వాతావరణం తెలుగుదేశపు నది బొడ్డులోని పల్లెటూరు, భాష తెలుగుదనం నుడికారం, పలుకుబడి పుణికిపుచ్చుకున్న అచ్చమయిన కన్నతల్లి లాంటి వ్యావహారికం" (పత్రత్రయి: పు-9) ఇలా ఉంటాయి కొలకలూరి వ్యాఖ్యలు. పత్రికా వ్యాసం గురించి చర్చిస్తూ సమీక్ష పరిమితుల్ని చెప్పారు. విమర్శ వ్యాస పరామర్శలో కొలకలూరి చాలా లోతులకు వెళ్లారు. ఒక్కొక్క రకం వ్యాసాన్ని నిర్వచించి, వివరించి సోదాహరణంగా పరామర్శించే కొలకలూరి పద్ధతిని నేటి విమర్శకులు తెలుసుకోవాలి. కొన్ని పదుల మంది సాహిత్య విమర్శకులు ఈ పత్రంలో నేటి పాఠకులకు పరిచయమౌతారు. ఈ పత్రం నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మాణమైనా, నేటికీ అనుసరణీయంగానే ఉంది. (విమర్శ మొదలైన తొలినాళ్లలో విమర్శ పండితుల పాండిత్య ప్రదర్శకంగా ఉండేది, ఇప్పుడలా లేదు, గతంలో వాదాలు చెలరేగినప్పుడు పండితులు దూషణకు దిగేవారు. ఇప్పుడలా లేదు- వంటి అభిప్రాయాలు కొలకలూరి పరిశీలనా శక్తికి నిదర్శకాలు.)

1966- 76 మధ్య ఒక దశాబ్దంలో వచ్చిన తెలుగు సాహిత్య విమర్శను కొలకలూరి చాలా వివరంగా చర్చించారు. ఈ దశాబ్దానికి ముందున్న సారస్వత విమర్శ విధానం ప్రత్యేకమైన పరిణామం ఏమీ లేకుండానే 1976 దాకా సాగింది అన్న పరికల్పనతో కొలకలూరి ఈ పత్రం రాశారు. ఈ దశాబ్దంలో ఆకాశవాణి, సాహిత్య సంస్థలు, సాహిత్య సంచికలు, పత్రికలు, సంకలనాలు వంటి అనేక పార్శ్వాల నుండి తెలుగు సాహిత్య విమర్శ ఉత్పత్తి అయిన తీరును కొలకలూరి వివరించారు.

తొలినాళ్లలో వచ్చిన సాహిత్య విమర్శకూ, నేటి విమర్శకూ తేడాలున్నాయని ఆయన గుర్తించారు. "తెలుగుసంఘం భిన్న రంగాలలో పొందిన అభ్యుదయం సారస్వతాన్ని లాగానే సారస్వత విమర్శనను కూడా ప్రభావితం చేసింది" అన్న ప్రతిపాదన చాలా విలువైనది (పు: 37) గతంలో సాహిత్య విమర్శలో పండితుల పాండిత్య ప్రదర్శన జరిగేదని, ఇవాళ సాహిత్య విమర్శలో పాండిత్య ప్రదర్శన అడుగంటిపోయిందని కొలకలూరి గుర్తించారు. "నేటి విమర్శకులు అందరూ అంతగా అటువంటి పండితులు కారు, పాండిత్యం బరువుతో సాహిత్య విమర్శనం కుంగిపోలేదు" (పు-39). ఈ పత్రంలో కొలకలూరి ఇంకా చాలా విషయాలు గుర్తించారు. ఉదా: పూర్వ విమర్శనంలో సామాజిక దృష్టి అల్పం, నేడు అధికం (పు-41) విమర్శలో నేటి దృక్పథ విశాలత మునుపటి కంటే ఎన్నో రెట్లు పెరిగింది (పు-21) 1960 దశకంలో పురుషుల ఆధిపత్యంలో ఉన్న తెలుగు సాహిత్య విమర్శరంగంలో స్త్రీలు ప్రవేశించారు (పు-43)

ఈ పత్రంలో కొలకలూరి విమర్శ, పరిశోధనల మధ్య గల తేడాలను స్పష్టం చేశారు. "ఆలోచన పిండుకున్నది పరిశోధనం, అనుభూతి పంచుకొన్నది విమర్శనం" (పు-45) అంతమాత్రం చేత ఈ రెండూ పూర్తిగా విరుద్ధ ప్రక్రియలు కాదని కూడా చెప్పారు.

ఈ పత్రం చదివితే పదేళ్లలో వచ్చిన గొప్ప విమర్శ పరిశోధన గ్రంథాలు మనకు పరిచయమౌతాయి.

మూడవది కొలకలూరి పరిశోధన విరాట్ రూపాన్ని ప్రదర్శిస్తుంది. 1842- 1982 మధ్య 140 ఏళ్లలో తెలుగునాట జానపద సాహిత్యం మీద జరిగిన కృషిని కొలకలూరి ఈ పత్రంలో వివరించారు. 1842 లో సిపి బ్రౌన్ చేసిన జానపద కథల సేకరణ మొదలుకొని 1982 లో జి.ఎస్.మోహన్ తెలుగు జానపద విజ్ఞానసూచి దాకా తెలుగు నాట జరిగిన జానపద సాహిత్య అధ్యయన వివరాలు ఈ పత్రంలో కొలకలూరి పరిశీలించారు. ఇది గుండెలు మరిగే పరిశోధన. "జానపద విజ్ఞానానికి ప్రపంచమంతా ప్రాచీనత ఉన్నా, ఈ పేరుతో ఈ ఆలోచనకు ఒకటిన్నర శతాబ్ది కూడా దాటలేదు. ఆంగ్లంలోలాగే ఆంధ్రంలో కూడా ఈ జానపద సాహిత్య దృష్టి ఈ మధ్యే ఆరంభమయింది" అన్నది కొలకలూరి చారిత్రక దృష్టి. 19 వ శతాబ్దం ప్రారంభంలో ప్రాచీన కావ్యాల సేకరణ, పరిష్కరణలు ముమ్మరంగా సాగినట్లే, జానపద గేయాలు, కథలు సేకరణ ప్రచురణ కూడా విరివిగా సాగినట్లు ఈ పత్రం తెలియజేస్తుంది. నేదునూరి గంగాధరం, చింతా దీక్షితులు, టేకుమళ్ల కామేశ్వరరావు, బిరుదురాజు రామరాజు, ఎస్వీ జోగారావు వంటి అసంఖ్యాక పరిశోధకుల కృషిని ఈ పత్రం పరామర్శించింది. మొదట జానపద సాహిత్య సేకరణ, తర్వాత దాని అధ్యయనం జరిగిన తీరును కొలకలూరి విశ్లేషణాత్మకంగా పరిశీలించారు.

కొలకలూరి తన పూర్వ పరిశోధకులు, తన సమకాలికులు, తన తరువాతి తరం వాళ్లు అందరినీ వివక్ష చూపకుండా పరామర్శించడం ఆయన సమదృష్టికి నిదర్శనం. తనివితీరా తెలుగు జానపద సాహిత్య పరిశోధనను పరామర్శించి "తెలుగు జానపద సాహిత్యంలో పరిశోధన బాగా జరుగుతూ ఉంది"అని సంతృప్తిని ప్రకటించారు.

జనపదం, జానపదులు, జానపద మనస్తత్వాలు ఒకటి కాదు, అవి వేరు వేరని చివరికి కొలకలూరి సిద్ధాంతం చేశారు. "జనపదంలోని వాళ్లంతా జానపదులని కానీ, జానపదుల కంతా జానపద మనస్తత్వం ఉంటుందనికాని, పట్టణాలలో జానపద మనస్తత్వం ఉంటుందనికాని, పట్టణాలలో జానపద మనస్తత్వం లేదనికాని, జానపదులు లేరనికాని, అది జానపదం కాకుండా పోతుందని కాని నిశ్చయించటం న్యాయం కాదు. జానపద సాహిత్యం, జానపద విజ్ఞానం జానపద మనస్తత్వ సంబంధితమైన సాహిత్యం - విజ్ఞానం. ఇది ప్రాదేశిక హద్దులు దాటుతుంది." (పు-100)

సృజనాత్మక రచయిత అయిన కొలకలూరి, పరిశోధన విమర్శల వైపు కూడా మొగ్గడం ఒక ఎత్తయితే, ఆధునిక రచయిత అయిన కొలకలూరి జానపద సాహిత్యం వైపు మొగ్గడం మరో ఎత్తు. ఆయన సాహిత్య వ్యక్తిత్వంలోని సమగ్రతకు ఈ పత్రం నిదర్శనం.

పత్రత్రయి మూడు సాహిత్య రంగాల అన్వేషణ. మూడు కాలాల మూడు ప్రక్రియల అన్వేషణ.

"ఉత్తమ సాహిత్య విమర్శ వాఙ్మయం అవతరించడానికి విశాల సారస్వత సృష్టి, ఉత్తమ విమర్శకుడు అవసరం. ఉత్తమ సమాజం ఉజ్జ్వల సారస్వతాన్ని, విమర్శనీ సృష్టిస్తుంది. ఉత్తమ విమర్శనం ఉత్తమ సమాజం కన్నబిడ్డ" (పత్రత్రయి: పు- 72)

(ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారి 85 వ జన్మదినం సందర్భంగా)

సా హి తి

అనంతాలోచన...

దేహనదిలో తడి ఆరినా
చినుకు పువ్వు మొండి ధైర్యం
కొత్త చిగుళ్లకు పురుడుపోసింది
నిప్పుల జడిపై అక్షరపు లేపనమద్ది
అనిర్వచనీయానుభూతిని
విరజిమ్మింది
ఆకుపచ్చతనం మూలాల్ని తడిమితే
మట్టి పరిమళం కవిత్వమై
పరివ్యాప్తమైంది
నిత్య జీవితం దుర్భరమే
ఇదొక లిప్తపాటు విశ్రాంతి మాత్రమే
కొత్త పొద్దులకు తప్పదన్నట్టుగా
కాంతిదీపాలు వెలిగిస్తూనే వుంటాం
మళ్ళీ మడతపడిన నాల్కల్ని
సరిచేసుకుంటాం
చర్విత చర్వణాల క్రమంలో
ధిక్కార స్వరాలై నిత్యశవాలై
ఇంకా బతికున్న బతుక్కి దిక్కవుతుంటాం
ఆకలి కడుపు మీద అలికినట్టే వుంటుంది
అనివార్యాలను తప్పించుకోనూ లేము
ముఖాలను విస్తరించుకుంటూనే వుంటాం
ఉద్యమ బద్ధమవుతాం
చోద్యాలు చూస్తాం వేగి ఆగి పోతాం
ఊపిర్లు ఊదేస్తాం
ఊరేగుతాం ఇంకో ముసుగుని తొడుక్కుని
ఉస్సూరుమంటాం
పడి లేస్తుంటాం
కెరటాలపై జాలిపడి గుర్తు చేసుకుంటాం
ఎగుడు దిగుళ్ళ ముళ్ళ చేతుల్లో
గువ్వలమై సున్నితంగా సుతారంగా చితికిపోతాం
పూలు కళ్ళు తేలేసినా
కొమ్మల చేతులు విరిగినా
చిదిమేసి ఛీత్కరించినా
జాలి సరస్సులమవుతాం
తామరాకుల్లా విశాలంగా కన్పిస్తాం
విస్తరాకుల్లా విస్తరిస్తాం
చీకటివలకు ఇంకెన్నోమార్లు చిక్కుతూనే వుంటాం
ఏదేమైనా చినుకుపువ్వు ఆత్మవిశ్వాసి
వినూత్న జీవన సూర్యోదయాలను ఆకాంక్షిస్తుంది
అసహనపు ముసుర్ల నుండి విముక్తి కావాలంటుంది
నదిని మానవత్వపు నిధి కమ్మంటోంది
వివేచనల జెండాలు ఎగరేసి
జీవన సత్యాలను విప్పిచెప్పమంటోంది

డా. తిరునగరి శ్రీనివాస్,
9441464764

గాయాలు చేసేసుకుపోతూ కాలం

కాలానికిదే పనేమో
ఎప్పుడూ గాయాలు చేస్తూ
చేసిన గాయాలింకా మానకముందే
విషాద గేయాలు రాసేసుకుంటూ పగబడుతూ
గుండె లోతుల్లోకి చొచ్చుకుపోయి
చీరుకుపోతున్న గుండెలు
కనిపించని గాట్లు
రెప్పలకింద కన్నీటి చారికలింకా ఆరనేలేదు
పోటెత్తిన సంద్రంలా
కంటి నదిలో ఉప్పొంగుతున్న అశ్రువుల కెరటాలు
ఆకస్మికంగా కన్నెర్రతో వీచే
పెనుగాలుల్లాంటి భయంకర బీభత్సాలు
ఒక్కొక్కటిగా రాల్చుతున్న
పచ్చని రక్తపాశపు పత్రహరితాలు
శ్లోకంలో పూరిస్తున్న శోకం శంఖారావాలు
కణకణమని గుండెలు మండించే కాలరేఖలు
ప్రియనాదం విలయపు తాండవమాడి
చేయిస్తూ ఆర్తనాదాలు
బంధాల నాడులు కర్కశంగా తెంపుతూ
మెడలో వేసుకుని ఆనందనాట్యం చేస్తూ
కలి క్రూర చేష్టలు
ఆడిస్తూ ఏడ్పిస్తూ ఉన్మాదంతో
ఊగిపోతూ ఆనందిస్తూ
వెర్రిగా వికటాట్టహాసగానం పాడుకుంటూ
పదేపదే గాయాలు చేసేసుకుపోతూ కలికాలం ...

నాగముని. యం, 9490856185

అక్షరాలా కళాప్రపంచం



గ్రంథ సమీక్ష

(కళా ప్రపంచం - ఎల్ ఆర్ వెంకట రమణ,
పేజీలు 250, వెల రూ./-
ప్రతులకు : నవోదయ, హైదరాబాద్ లేదా
9866158908/ 9885289995)

కళ అంటే చాలా మందికి కేవలం కాలక్షేప వ్యవహారం. ఆ మధ్య 'కళ కళ కోసమా? లోకకళ్యాణం కోసమా?' అనే విచికిత్సకు తెరలేపారు కొందరు. కళను ఆత్మానుభూతిగా భావించేవారిని, తిరోగమనవాదులు లేదా

ఆత్మాశ్రయవాదులని, లోకకళ్యాణంకోసం అనేవారిని అభ్యుదయ వాదులనడం మొదలుపెట్టారు. ఈ విచికిత్స నాదృష్టిలో హాస్యాస్పదం. ఎందుకంటే ఏ కళయినా అభ్యుదయం కోసమే. వ్యక్తి నుంచే వ్యవస్థ, సమాజంపుడతాయి కనుక! మానవమేధస్సులోని అంతర్గత శక్తుల నుంచి ఆవిర్భవించిన కళ హృదయోల్లాసానికి, మానసికోల్లాసానికి దారి తీయడమే కాక పనిలో పనిగా సమాజోల్లాసానికి, సామాజిక పురోగమనానికి దారితీస్తుందని నా అభిప్రాయం.

ఒక కవి మేధోవల్మీకంలో పుట్టిన ఓ కవిత ఎందరిని ఆలోచింప చేస్తుంది? ఎంత మందికి అతని హృదయాన్ని పట్టిస్తుందనేది ఊహించాలి. ఆ కవితలో నిజంగా అతని హృదయమే ఉంటే దాన్ని ఇతరులకు ఒక పాఠంలా లేదా గుణ పాఠంలా తెలియచెప్తుంది. కనుక కళ కళ కోసమే కాదు సామాజిక వికాసానికి కూడా దోహదం చేస్తుంది.

ముళ్ళపూడి వారు ఏదో సినిమాలో హాస్యానికి అనిపించినా ఒక మంచి డైలాగ్ పెట్టారు -

"మడిసన్నాక కూసింత కళాపోసన ఉండాల.. తిని తొంగుంటే మనిషికి గొడ్డుకి తేడా ఏముంది?" అని.

ఖచ్చితంగా మనిషికి కళాపోషణ ఉండాలి.. కళాహృదయం ఉండాలి.. ఒకప్పుడు కళల్ని రాజులు జమీందారులు ప్రోత్సహించారు. బతికించారు. కళాకారులను సత్కరించారు. ఇవాళ ఆ పని ప్రభుత్వాలు, ప్రజలు, సంస్థలు సాంస్కృతిక సంస్థలు భుజాలకెత్తుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

ఎల్. ఆర్. వెంకటరమణ రూపుదిద్దిన 'కళా ప్రపంచం' పుస్తకం నిజంగా ప్రపంచ కళాకారుల హృదయాల సమాహారం. దీన్ని సంకలించిన వెంకటరమణ ధన్యులు. చదివిన పాఠకులు మరింత ధన్యులు. దేశ విదేశాలకు చెందిన ఎక్కడెక్కడి మహానుభావులైన కళాకారులందరి సమాచారాన్ని ఒక పుస్తకంగా తీసుకుని వచ్చి కళాప్రియులకు అందించారు వెంకటరమణ. ఆషామాషీగా కాక వారు ఈ పుస్తకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దారు. ముద్రణ ఉన్నతంగా ఆకర్షణీయంగా ఉంది. ఖర్చుకు వెనుకాడకుండా వారు చేసిన ఈ సాహసం కళా ప్రపంచంలో స్థిరంగా నిలిచి పోతుందనిపిస్తుంది.

ఆధునిక భారతీయ చిత్రకళకు ఆద్యుడైన అవనీంద్రనాథ టాగోర్ నుంచి ఫ్రెంచ్ చిత్రకారుడు, తత్వవేత్త లియోనార్డో డావించి, మైఖేలాంజెలో, రాఫెల్, చర్చిల్, టాల్‌స్టాయ్ వంటి మహానుభావుల జీవిత విషయాలను సమగ్రంగా కాకపోయినా ఉపరితల స్పర్శ మాత్రమే అయినా తెలుగు పాఠకులకి అర్థమయ్యేలా అందించడం గొప్ప విషయం. ఆధునిక తెలుగు చిత్రకారులు గోపాలరావు, సి ఎన్ వెంకటరావు, సుందర రాజారావు, చిత్రకళావధాని సింగంపల్లి సత్యనారాయణ రావు వంటి వారి గురించి తెలుసుకుంటుంటే మనసు ఆనందంతో పరవళ్లు తొక్కుతుంది. భారతీయ చిత్రకారుడు, సాహితీ వేత్త రవీంద్రనాథ్ ఠాగూర్, సత్యజిత్ రే, హుస్సేన్ వంటి ఇంకా మరెందరో పేరు మోసిన మహానుభావులు ఈ పుస్తకంలో మనకి కనబడతారు. కేవలం సాహితీమూర్తులు చిత్రకారులే కాక వివేకానంద స్వామి, అరవింద మహర్షి వంటి జాతి వైతాళికులు గురించి కూడా ఈ పుస్తకంలో అద్భుతంగా చెప్పారు వెంకటరమణ. ఒక్కొక్క ఖండికకు వారిచ్చిన శీర్షికలు వారిచ్చిన వ్యాఖ్యలు చాలా అద్భుతం అనిపిస్తాయి. ఎన్నో శ్రమలకోర్చి ఈ పుస్తకంలో 53 మంది కళాకారుల, కళా విమర్శకుల, రచయితల, కవుల జీవన రేఖల్ని పొందుపరిచారు.

ఇందులో ఇంకా కరుణశ్రీ, బుచ్చిబాబు, పాలగుమ్మి పద్మరాజు, సినారె, రావూరి భరద్వాజ, చలసాని ప్రసాదరావు, సంజీవ్ దేవ్, మాలతీ చందూర్ శివరాజు సుబ్బలక్ష్మి వంటి వారి గురించి కూడా అద్భుతంగా చెప్పారు. సంగీతంతో ప్రపంచాన్ని ఊపేసిన బీథోవెన్, మైఖేల్ జాక్సన్, ఏ ఆర్ రెహమాన్ ల మీద ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ దీన్ని ఆనందంగా ఆస్వాదించవచ్చు. ఒక రిఫరెన్స్ బుక్‌గా పెట్టుకో తగినంత గొప్ప సమాచారం ఈ పుస్తకంలో నిండివుంది. ఇక పుస్తకంలో ఆ కళాకారులకు సంబంధించిన చిత్రాలు నలుపు తెలుపులో చాలా అద్భుతంగా సందర్భానుసారంగా ఉండి పాఠకులను మరో లోకంలోకి తీసుకువెళతాయి. కవర్ పేజీని ఎంబోసింగ్ చేయించడం వల్ల ఒక గొప్ప పుస్తకాన్ని చదవ బోతున్నాం అన్న ఉత్సుకత పాఠకుడిలో కలుగుతుంది. దీనికి కర్త కర్మ క్రియ అయిన వెంకటరమణచాలా విషయాల్లో ఉన్నతులైనా ఒదిగొదిగిఉండడం కళలపట్ల వారికున్న అభిరుచికి అద్దం పడుతుంది. ఈ పుస్తకాన్ని గురించి చాలా చాలా చెప్పాలని ఉంది కానీ స్థలాభావం దృష్ట్యా విరమిస్తున్నాను. కళలపట్ల ప్రీతి ఉన్నవారు, ఆసక్తి ఉన్నవాళ్లు, కళా ప్రపంచంలో మునిగి తేలుతున్న వారు, కళ కోసం జీవితాన్ని అంకితం చేసిన వారు ఏ ఏ దేశాల్లో ఎలాంటి వారు పుట్టారో తెలుసుకోవాలన్న తపన మీకు ఉంటే ఈ పుస్తకాన్ని తప్పనిసరిగా చదవండి.

షడ్రుచులతో సంపూర్ణమైన విందుభోజనంచేసిన సంతృప్తిని ఇస్తుంది.

చంద్ర ప్రతాప్ కంతేటి, 8008143507

మంచి మార్గం



నొప్పి లేని జననం మరణం లేని ప్రాణి
అలలు లేని కడలి కలలు లేని కనులు
రెమ్మలు లేని కొమ్మలు
విత్తనం లేని వృక్షం
పగలుండని రాత్రి
గతం లేని వర్తమానం
సంఘర్షణ లేని జీవి
రగలకుండా "రవి"వెలుగు...!
నొప్పి- ఊరట
పగలు- రాత్రి వంటివి
బాధో, భయమో వెంటాడితేనే కదా
మదికి మంచి మార్గం తట్టేది...!

డాక్టర్. మహమ్మద్ హసన్
సెల్ :9908059234

శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు - 2023

శివేగారి దేవమ్మ కథా పురస్కారాల కొరకు 2022, 2023లో ప్రచురించిన కథా సంపుటాలు, బాలల కథాసంపుటాల్ని ఆహ్వానించటం జరిగింది. ఈ పోటీకిగాను 48 కథా సంపుటాలు, 33 బాలల కథా సంపుటాలు అందాయి. కథల విభాగంలో మునిసురేష్ పిళ్లె రచించిన (గారడీ వాడు) కథల సంపుటి ఎంపికైంది. బాలల కథావిభాగంలో కుసుమంచినాగేంద్ర రచించిన చందమామలో మేనమామ, ఆర్.సి. కృష్ణస్వామిరాజు రచించిన కార్వేటినగరం కథా సంపుటాలు ఎంపిక అయ్యాయి.న్యాయనిర్ణేతలుగా వేంపల్లి షరీఫ్, డా. ఎస్. రఘు వ్యవహరించారు. బాలల కథా సంపుటాలకు గాను డి.కె. చదువుల బాబు, పైడిమర్రి రామకృష్ణలు వ్యవహరించారు.

అవార్డు వ్యవస్థాపకులు: కె.వి. మేఘనాథ్ రెడ్డి, 6300318230.

కాట్రగడ్డ దయానంద్ కథా సంపుటి పండుటాకు, గుండ్లకమ్మ తీరాన ఆవిష్కరణ సభ

జూలై 4, 2024 గురువారం సాయంత్రం 6.30 గంటలకు అన్నమయ్య కళావేదిక, శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, బృందావన గార్డెన్స్, గుంటూరు నందు కాట్రగడ్డ దయానంద్ కథాసంపుటి పండుటాకు, గుండ్లకమ్మ తీరాన కథాసంపుటిని డాక్టర్ పాపినేని శివశంకర్ ఆవిష్కరిస్తారు. కందిమళ్ళ శివప్రసాద్ అధ్యక్షత వహించే ఈ సభలో డి.ఎస్.వి.ఆర్.మూర్తి, వాసిరెడ్డి నవీన్, వి.ప్రతిమ, మోదుగుల రవికృష్ణ పాల్గొంటారు.

మోదుగుల రవికృష్ణ, ఈశ్వర వరప్రసాద పరిషత్తు, గుంటూరు.

అక్టోబరులో అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీల మహాసభ

బీరుట్: అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు (ఐఎంసీడబ్ల్యూపీ) మహాసభ అక్టోబరు 25-27 తేదీల్లో లెబనాన్ రాజధాని బీరుట్‌లో జరగబోతోంది. లెబనాన్ కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో 24వ ఐఎంసీడబ్ల్యూపీ జరగబోతోంది. ఈ మేరకు ఐఎంసీడబ్ల్యూసీ కార్యనిర్వాహక సంఘం (డబ్ల్యూజీ) బీరుట్ సమావేశం నిర్ణయించింది. సమావేశానికి గ్రీస్ కమ్యూనిస్టు పార్టీతో పాటు 14 కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఫాసిజాన్ని సృష్టించే పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దురాక్రమణ, దురహంకారంపై అంతర్జాతీయ పోరాటాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని సమావేశం తీర్మానించింది. పలస్తీనా ప్రజలకు, వారి ప్రతిఘటనకు మద్దతు తెలిపింది.

రాజకీయ ఖైదీలను తక్షణమే విడుదల చేయాలి

సూడాన్ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్

ఖార్తూమ్: సూడనీస్ కమ్యూనిస్టు పార్టీ (ఎస్‌సీపీ)పై ఆ దేశ ప్రభుత్వం నిర్బంధకాండకు తెరతీసింది. అనేకమంది సభ్యులను నిర్బంధించింది. దీంతో తమ వారితో పాటు రాజకీయ ఖైదీల విడుదల కోసం సూడాన్ కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. యుద్ధాన్ని వ్యతిరేకించిన తమ పార్టీ సభ్యులు, ఇతర రాజకీయ అసంతృప్తి వాదుల విడుదలకు డిమాండ్ చేసింది. సూడాన్ కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు అమల్ ఎల్ జైన్‌ను అక్రమంగా అరెస్టు చేశారని, గోప్యంగా ఉంచారని, కుటుంభ సభ్యులనుగానీ న్యాయవాదులకుగానీ ఆమెను కలవనివ్వలేదని పార్టీ తెలిపింది. రాజకీయ ఖైదీల విడుదల తక్షణావశ్యమని ప్రకటనలో కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఫతీ అల్ ఫడల్ పేర్కొన్నారు. 'కమ్యూనిస్టు పార్టీ, రాజకీయ నేతలు, పౌర సంఘాల ప్రతినిధులను తక్షణమే విడుదల చేయాలి. నిర్బంధంలో ఉన్న వారి భద్రతకు సైనిక ఇంటెలిజెన్స్, అధికారులే బాధ్యత వహించాలి. నిర్బంధంలో ఉన్న వారితో గౌరవంగా ప్రవర్తించాలి. వారిపై మానవతా దృక్పథంతో చర్యలు ఉండాలి. అనారోగ్యానికి గురైతే తగిన వైద్యం అందించాలి' అని డిమాండ్ చేశారు. రాజకీయ ఖైదీల విడుదలకు చేపట్టిన పోరాటానికి మద్దతివ్వాలని మానవహక్కుల సంఘాలను ఆయన కోరారు.

కెనడాలో ఎయిర్‌క్రాఫ్ట్ మెకానిక్ల మెరుపు సమ్మె

407 విమానాలు రద్దు

ఒట్టావా: కెనడాలో వెస్ట్‌లైన్ ఎయిర్‌లైన్స్‌కు వ్యతిరేకంగా ఎయిర్‌క్రాఫ్ట్ మెకానిక్స్ ఫ్రటెర్నల్ అసోసియేషన్‌కు చెందిన మెయింటెనెన్స్ ఇంజినర్లు, టెక్నికల్ సిబ్బంది మెరుపు సమ్మె చేశారు. బ్రిటిష్ కొలంబియా, రిచ్‌మండ్‌లో వాంకోవర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. మెయింటెనెన్స్ వర్కర్ల సమ్మె ప్రభావం 49వేల మంది ప్రయాణికులపై పడింది. దేశీయ-అంతర్జాతీయ విమానాలు మొత్తం 407 రద్దయ్యాయి.

మెరుగైన వేతనాల కోసం కార్మికులు సమ్మె చేశారు. దీనిపై ఎయిర్‌లైన్ సీఈవో అలెక్సిస్ వోన్ హోయిన్స్‌బ్రోచ్ స్పందిస్తూ... కార్మికుల సంఘంతో చర్చలు తుది దశకు చేరుకున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో సమ్మెకు అర్థంలేదని, ప్రతిపాదిత ఒప్పందాన్ని కార్మిక సంఘం తిరస్కరించిందని చెప్పారు. ఈ ఒప్పందానికి కార్మికులు అంగీకరించి ఉంటే దేశంలోనే ఉత్తమ వేతనాన్ని పొందే ఎయిర్‌లైన్ మెకానిక్‌లుగా నిలిచేవారని తెలిపారు.

ఉపేంద్ర ద్వివేది బాధ్యతల స్వీకరణ

(మూడోపేజీ తరువాయి)

చదివారు. 1981 జనవరిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీయే)లో చేరారు. 1984 డిసెంబర్‌లో జమ్మూకశ్మీర్ రైఫిల్స్ 18వ బెటాలియన్‌లో నియమితులయ్యారు. ఆ తర్వాత కశ్మీర్ లోయ, రాజస్థాన్ ఎడారులలో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల బెటాలియన్‌కు నేతృత్వం వహించారు. మరోవైపు ఇన్‌స్పెక్టర్ జనరల్ అస్సాం రైఫిల్స్, అస్సాం రైఫిల్స్ సెక్టార్ కమాండర్‌గా తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో ఉపేంద్ర ద్వివేది విశేష సేవలు అందించారు. ఈశాన్య ప్రాంత కమాండర్‌తోపాటు ఇండో-మయన్మార్ సరిహద్దు నిర్వహణ బాధ్యతలు వహించారు. ఆ తర్వాత రైజింగ్ స్టార్ కార్ప్సును కమాండ్ చేశారు. 2022-2024 వరకు సవాళ్లతో కూడిన వెస్టన్ ఫ్రంట్, నార్తర్న్ ఆర్మీకి నేతృత్వం వహించారు. భారత సైన్యాన్ని అత్యాధునిక ఆయుధాలతో ఆధునికీకరించేందుకు కృషి చేశారు. సైన్స్ గ్రాడ్యుయేట్ అయిన సునీతా ద్వివేదిని ఆయన వివాహం చేసుకున్నారు. సునీతా ద్వివేది భోపాల్‌లోని దివ్యాంగ చిన్నారుల కోసం ఆరుషి అనే సంస్థను స్థాపించారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇక పదవీ విరమణ చేసిన ఆర్మీ చీఫ్ జనరల్ పాండే, కార్ప్స్ ఆఫ్ ఇంజనీర్స్ నుండి ఆర్మీ చీఫ్ అయిన మొదటి అధికారి. ఆయన నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి. జనరల్ పాండే 1982 డిసెంబర్‌లో కార్ప్స్ ఆఫ్ ఇంజనీర్స్‌లో నియమితుడయ్యారు. జమ్మూకశ్మీర్‌లోని లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్‌ఓసీ) వెంట పల్లన్‌వాలా సెక్టార్‌లో ఆపరేషన్ పరాక్రమ్ సమయంలో ఆయన ఇంజనీర్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించారు.

నాటి బాల్య స్నేహితులే నేటి అత్యున్నత కమాండర్లు

బాల్య స్నేహితులు దేశ రక్షణదళాల అత్యున్నత కమాండర్లుగా మారారు. వీరు మరెవరో కాదు దేశంలోని ఆర్మీ, నేవీ అధిపతులు. అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి భారత నౌకాదళ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. త్రిపాఠి, ద్వివేది 1970లో మధ్యప్రదేశ్ రేవాలోని సైనిక్ స్కూల్ లో కలిసి చదువుకున్నారు. నాటి నుంచే వారిద్దరి మధ్య బలమైన స్నేహబంధం ఉంది. ప్రస్తుతం వారు వేర్వేరు దళాలకు నాయకత్వం వహిస్తున్నప్పటికీ పరస్పరం సలహా సంప్రదింపులు జరుపుతుంటారు. రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి భరత్ భూషణ్ బాబు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని పోస్ట్ చేస్తూ.. "ఇద్దరు అద్భుతమైన విద్యార్థులను మిలటరీలో అత్యున్నత సేవలు అందించగలిగే అధికారులుగా తీర్చిదిద్దిన అరుదైన గౌరవం రేవాలోని సైనిక్ స్కూల్‌కు దక్కుతుంది" అని అభినందించారు.

వణికిస్తున్న డెంగీ

(మూడోపేజీ తరువాయి)

శాస్త్రీయం కాదని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అంటున్నారు. విధిగా అందుబాటులో ఉండే ఐజీఎం పరీక్ష చేయించాలని, ప్లేట్‌లెట్లు 20 వేలలోపు పడిపోతే అది ప్రమాదకరంగా భావిస్తారు. 15 వేల కన్నా తగ్గితే డెంగీ షాక్, డెంగీ మరణాలు సంభవిస్తాయి అంటున్నారు. డెంగీ జ్వరం వస్తే తీవ్రతను తగ్గించేందుకు చల్లని నీటిలో స్పాంజ్‌ను ముంచి శరీరాన్ని తుడవాలి. ఎలక్ట్రాల్ పౌడర్, పండ్ల రసాలు రోగికి ఇవ్వాలి. దీనివల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్లు అదుపులోకి వస్తాయి. ఇంకా తగ్గకుంటే వైద్యుని వద్దకు తీసుకెళ్లాలని వైద్య ఆరోగ్యశాఖ సూచించింది. పరిసరాలు శుభ్రంగా ఉంచాలి. కాచి వడగాచిన నీటిని తాగాలి. విపరీతంగా మంచినీరు తాగాలి. పండ్ల రసాలు తీసుకోవాలి. దీనివల్ల ప్లేట్‌లెట్లు పడిపోకుండా ఉంటుందని చెబుతోంది. ఉన్నట్టుండి తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి, కళ్లు తెరవడం కూడా కష్టంగా ఉండటం డెంగీ లక్షణాలుగా భావించాలి. చర్మంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు ఉంటాయి. డెంగీని ముందుగా గుర్తిస్తే 80 శాతం వరకు ఎటువంటి ప్రమాదం లేకుండా చికిత్స పొందవచ్చని డాక్టర్లు అంటున్నారు. కొందరికి ముక్కు నుంచి కానీ, మలం ద్వారాగానీ, బ్రష్ చేసేటప్పుడు పళ్ల మధ్య నుంచి రక్తస్రావం అవుతుంది. ఇలా అధికంగా రక్తస్రావం అయితేనే ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. మహిళలకు పిరియడ్స్ సమయంలో సాధారణ రక్తస్రావం కంటే అధికంగా అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. డెంగీ విషయంలో సాధారణంగా ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకపోతే 20 వేల వరకు ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గినా నష్టంలేదని, అనారోగ్య సమస్యలు ఉన్నప్పుడు 50 వేల వరకు ప్లేట్‌లెట్లు తగ్గినా ఇబ్బంది లేదని వైద్య నిపుణులు అంటున్నారు. చాలా కేసుల్లో సాధారణ జ్వరానికి చేసే వైద్యమే సరిపోతుందని అంటున్నారు. ప్రతిఏటా డెంగీ రోగులను ప్రైవేట్ ఆస్పత్రులు దోపిడీ చేస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనేక ప్రైవేటు ఆస్పత్రులు 50 వేలకు పైగా ప్లేట్‌లెట్లు ఉన్నా ఐసీయూలో ఉంచి అదనంగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. నాలుగైదు రోజులకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఫీజులు వసూలు చేసిన సంఘటనలు ఉన్నాయి. విష జ్వరాలకు కూడా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు తప్పుడు రిపోర్టులు ఇస్తున్నాయని, ప్లేట్‌లెట్లు ఎక్కువున్నా తక్కువ చూపిస్తున్నాయన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందుతున్నట్టు తెలుస్తోంది.

రిజర్వేషన్లు 50 శాతం మించి ఉండాలి

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

న్యూదిల్లీ : రిజర్వేషన్లు 50 శాతం మించి ఉండేలా పార్లమెంటు చట్టాన్ని ఆమోదించాలని కాంగ్రెస్ ఆదివారం పేర్కొంది. బీహార్‌లో కోటా పెంపును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఎన్‌డీఏ భాగస్వామ్య జేడీ(యూ) డిమాండ్ చేసిన మరుసటి రోజే ఈ ప్రకటన చేసింది. శనివారం ఇక్కడ జరిగిన జనతాదళ్-యునైటెడ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సీలు), షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టీలు), ఇతర వెనుకబడిన కులాలు (ఓబీసీలు) కోటాను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచుతూ బీహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొట్టివేస్తూ ఇటీవల పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. సమావేశంలో ఆమోదించిన రాజకీయ తీర్మానంలో జేడీ(యూ) తన న్యాయ సమీక్షను తోసిపుచ్చడానికి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో రాష్ట్ర చట్టాన్ని ఉంచాలని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' లో చేసిన ఒక పోస్ట్‌లో, 'లోక్‌సభ ఎన్నికల ప్రచారం అంతటా, ప్రతిపక్ష పార్టీ 1994లో తమిళనాడు చట్టం మాదిరిగానే ఎస్‌సీలు, ఎస్‌టీలు అన్ని వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లకు సంబంధించిన అన్ని రాష్ట్ర చట్టాలను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని చెబుతోంది. శనివారం పాట్నాలో జరిగిన జేడీ(యూ) సమావేశంలో కూడా అదే డిమాండ్ చేయడం విశేషం. కానీ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ దాని మిత్రపక్షమైన బీజేపీ ఈ విషయంలో పూర్తిగా మౌనంగా ఉంది' అని పేర్కొన్నారు. 'అయితే, 50 శాతం పరిమితికి మించిన రిజర్వేషన్ చట్టాలను తొమ్మిదో షెడ్యూల్‌లోకి తీసుకురావడం కూడా పరిష్కారం కాదు, ఎందుకంటే 2007 సుప్రీంకోర్టు నిర్ణయం ప్రకారం, అటువంటి చట్టాలు న్యాయ సమీక్షకు కూడా లోబడి ఉంటాయి. దీని కోసం రాజ్యాంగ సవరణ చట్టం అవసరం. ఇటువంటి పరిస్థితిలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అన్ని వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు 50 శాతానికి మించటానికి వీలు కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించడమే ఏకైక మార్గం' అని కేంద్ర మాజీ మంత్రి తెలిపారు.

కంప్యూటర్‌కే క్యూ!

(మూడోపేజీ తరువాయి)

ఉంది. ఏఐసీటీఈ ఆమోదముద్ర వేస్తే... ఈ విద్యా సంవత్సరం గణనీయంగా ఇంజినీరింగ్ సీట్ల సంఖ్య పెరగనుంది. అటు ఏపీలో ఇంజినీరింగ్ విద్యకు ప్రామాణికత తగ్గడంతో వేలాది మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారు. సొంత రాష్ట్రం కంటే... ఇతర రాష్ట్రాలపైనే ఆసక్తి చూపుతున్నారు. ప్రతిభగల వారంతా ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీల్లో ప్రవేశాలు పొందుతున్నారు. మిగిలిన వారిలో డీమ్డ్, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకే మొగ్గుచూపుతున్నారు. ఎక్కడ ప్రవేశం పొందినా, వారిలో సగం మందికిపైగా కంప్యూటర్ బ్రాంచికే జై కొడుతున్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఈసీ) బ్రాంచికి ఆటుపోట్లు ఎదురవుతున్నప్పటికీ... వాటి సీట్ల పెంపులో ప్రైవేట్ యాజమాన్యాలు ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. 2024-25 విద్యా సంవత్సరానికి కూడా రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు అత్యధికంగా కంప్యూటర్, దాని అనుబంధ రంగ సీట్ల పెంపుపైనే ఆసక్తి చూపినట్లు తెలిసింది. మిగిలిన కోర్ బ్రాంచీలైన మెకానికల్, సివిల్, ఈఈఈపై యథాతథంగా నిర్లక్ష్యం చూపుతున్నాయన్న ప్రచారం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 235 ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలలున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు ఇంజినీరింగ్ సీట్లను భర్తీ చేస్తాయి. అందులో డీమ్డ్ విశ్వవిద్యాలయాలు మినహా మిగిలిన అన్ని విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ కళాశాలల్లో ఇంజినీరింగ్ సీట్లను ఏపీ ఈఏపీసెట్ 2024 కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు. గత విద్యా సంవత్సరం 2023-24 విద్యా సంవత్సరానికి 1,49,154 సీట్ల భర్తీకి ఏఐసీటీఈ ఆమోదముద్ర వేసింది. అందులో సగానికి పైగా అంటే 77,730 సీట్లలో కంప్యూటర్ కోర్సులే ఉండటం గమనార్హం. 2024-25 విద్యా సంవత్సరంలోనూ ఇంజినీరింగ్ సీట్ల సంఖ్యతో పాటు కంప్యూటర్ సీట్లు గణనీయంగా పెరగనున్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏపీ ఈఏపీసెట్ 2024 వెబ్ కౌన్సెలింగ్ (ఎంపీసీ స్ట్రీమ్) షెడ్యూలు జారీజేసింది. ఈనెల 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించనుంది. ఏపీ ఈఏపీసెట్ 2024కు ఇంజినీరింగ్ విభాగంలో 2,58,374 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,95,092 మంది (75.51 శాతం) మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారందరికీ ఏ బ్రాంచిలోనైనా సీటు వచ్చే అవకాశం ఉంది.

కంప్యూటర్ కోర్సులకు కృత్రిమ డిమాండ్

అంతర్జాతీయంగా సాఫ్ట్‌వేర్ రంగం ఆటుపోట్లకు గురవుతున్న సమయంలోనూ కంప్యూటర్ సీట్లకు కృత్రిమంగా కళాశాలల యాజమాన్యమే గిరాకీ పెంచుతోందన్న ప్రచారం ఉంది. ప్రస్తుత సమయానికి కొన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు విశ్వవిద్యాలయాల నుంచి అనుబంధిత గుర్తింపు రాలేదు. కౌన్సెలింగ్ సమయం నాటికి వాటి జాబితా ఓ కొలిక్కి రావాలి. ఈ ప్రక్రియ పూర్తికాకముందే చాలా కళాశాలల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఈసీ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) కోర్సుల పెంపు పైనే దృష్టి పెట్టాయి. కంప్యూటర్ బ్రాంచిల్లో సీఈసీతో పాటు వాటికి అనుబంధంగా ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ తదితర నూతన కోర్సులు ప్రవేశపెడుతున్నారు. మెకానికల్, సివిల్ సీట్ల పెంపుపై ఆసక్తి చూపడం లేదు. ఆయా రంగాల కోర్ సబ్జెక్ట్ బ్రాంచీలు చదవాలనే ఆసక్తితో విద్యార్థులున్నప్పటికీ మార్కెట్‌లో వాటికి అంత ప్రయోజనం లేదన్న దుష్ప్రచారంతో వెనుకడుగు వేస్తున్నారు. తుదకు వారు కూడా కంప్యూటర్ బ్రాంచిని ఎంచుకుంటున్నారు. పేరొందిన ప్రైవేట్ విశ్వవిద్యాలయం, ఇంజినీరింగ్ కళాశాలల్లో కోర్ బ్రాంచీలో సీటు వచ్చినా ప్లేస్‌మెంట్లు వస్తాయన్న దూరదృష్టితో ప్రవేశాలపై విద్యార్థులు ఆసక్తి చూపుతన్నారు. ఏపీ ఈఏపీసెట్ 2024 కౌన్సెలింగ్ ప్రారంభానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్య సీట్లకు అనధికారికంగా భర్తీ ప్రక్రియ ప్రారంభమైందన్న ప్రచారం ఉంది. ముందస్తుగానే విద్యార్థుల నుంచి సీట్ల భర్తీకిగాను రూ.25 వేలకు పైగా రుసుం తీసుకుంటున్నారని తెలిసింది. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ప్రత్యేకంగా ఒక పీఆర్వో వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రవేశాలను నిర్వహిస్తున్నాయి. విశ్వవిద్యాలయాల అధికారులు తనిఖీల సమయంలో బోధనా సిబ్బంది, మౌలికవసతులు సరిగ్గా లేకపోయినా, ఉన్నట్లుగా నివేదికలిస్తూ ఇష్టానుసారంగా ప్రైవేట్ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించినట్లు విమర్శలున్నాయి. ఇంజినీరింగ్ కళాశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన సీఈసీ, ఈసీఈ తదితర కోర్సులకు కన్వీనర్ సీట్లను భర్తీ చేసేందుకు ముందస్తు ఫీజులు వసూలు చేయడంపై ప్రభుత్వం సమగ్ర దర్యాపునకు ఆదేశించాలని విద్యార్థి, తల్లిదండ్రుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఏపీ ఈఏపీసెట్ 2024 వెబ్ కౌన్సెలింగ్ వెబ్‌సైట్‌లో విద్యార్థుల ఐచ్ఛికాలకు ముందే ఆయా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఉన్న సీట్ల వివరాలను వెల్లడించాలని కోరుతున్నాయి.

'నీట్'పై కేంద్రం దిద్దుబాట!

న్యూదిల్లీ: నీట్ ప్రశ్నపత్రాల లీకేజి, ఫలితాల్లో అవకతవకలు జరగడం దేశంలో అలజడి సృష్టించింది. పరీక్షా విధానాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిలదీశారు. విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన ప్రభుత్వం... అవినీతి, అక్రమాలను నిర్లక్ష్యం చేస్తూ పిల్లల జీవితాలతో చెలగాటమాడుతోందని ప్రతిపక్షాలు దుయ్యబట్టాయి. నీట్ అంశమై పార్లమెంటు సైతం దద్దరిల్లింది. ఈ తరుణంలో కేంద్రప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఆన్‌లైన్ మాధ్యమంగా ఈ పరీక్ష నిర్వహించాలని యోచిస్తోంది. పరీక్ష నిర్వహణలో లోపాలు, అక్రమాలను కేంద్ర విద్యాశాఖ అంగీకరించింది. ఇదే క్రమంలో ఆరోగ్యశాఖ గతంలో చేసిన సిఫార్సుల మేరకు ఈ పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) మాధ్యమం లేక ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించేందుకు యోచిస్తోంది. తద్వారా ప్రశ్నపత్రాల లీకేజిని అరికట్టవచ్చని భావిస్తోంది. అక్రమాలు వెలుగు చూడటంతో వాయిదా పడిన పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయించింది. జులై 25,26,27 తేదీల్లో సీఎస్ఐఆర్ -యూజీసీ నెట్, ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 8 వరకు యూజీసీ-నెట్ పరీక్ష, జులై 10న ఎన్‌సెట్ పరీక్షలు జరగనున్నాయి. వీటిని ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించేందుకు కసరత్తు జరుగుతున్నట్లు తెలిసింది.

పోటీ పరీక్షల్లో మోసాలు, పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) లేక ఆన్‌లైన్ విధానంలో నీట్ పరీక్షలు నిర్వహించడం సరైనదిగా నిపుణులు సూచించారు. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణకు కేంద్ర ఆరోగ్య శాఖ అంగీకరించని కారణంగా 2017 నుంచి రాతపరీక్షగానే 'నీట్' ఉంది. నీట్ పేపర్ లీక్ వ్యవహారం వెలుగు చూడటంతో ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వ ఏడుగురు సభ్యుల కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సిఫార్సు చేసిన పద్ధతులు, సంస్కరణలను అనుసరించి డేటా సెక్యూరిటీ ప్రోటోకాల్స్‌ను, ఎన్‌టీఏ పనితీరును మెరుగుపర్చాలని కేంద్రం భావించింది.

'సీబీటీ' నిర్వహణలో సవాళ్లు అనేకం

నీట్ పరీక్షను సీబీటీ (ఆన్‌లైన్) మాధ్యమంగా నిర్వహిస్తే మౌలికవసతుల కల్పన పెద్ద సవాల్‌గా నిలుస్తుంది. అభ్యర్థుల కోసం సరిపడ కంప్యూటర్లు అందుబాటులో ఉంచడమే కాకుండా వాటికి స్థిర విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ కనెక్షన్ కల్పించడం సులువు కాబోదు.

దేశంలోని చాలా ప్రాంతాల్లో డిజిటల్ వసతులు అంతంత మాత్రంగానే ఉండటం విదితమే. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించడమంటే ప్రశ్నపత్రాల వేర్వేరు వెర్షన్లు ఉండాలి. మార్కుల సాధారణీకరణ (నార్మలైజేషన్) సమస్య కాగలదు. పరీక్షను షిఫ్టుల వారీగా అనేక రోజుల పాటు నిర్వహించాల్సి వస్తుంది. కాబట్టి పత్రాపత్రాల సెట్లు చాలానే అవసరమవుతాయి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెద్దగా ఉండదు. పరీక్ష రాసేందుకుగాను వారికి ముందస్తుగా శిక్షణ ఇవ్వాలి. పరీక్ష ఎలా రాయాలో అవగాహన కల్పించాలి. పరీక్ష పారదర్శకంగా జరిపించడం కూడా సవాళ్లతో కూడుకున్నదే. కంప్యూటర్ పరీక్షా విధానంతో భద్రత మెరుగవుతుంది కానీ పరీక్షల్లో మోసం చేసే కొత్త పద్ధతులు పుట్టుకొస్తాయి. కంప్యూటర్ హాకింగ్ లేక అభ్యర్థి స్థానంలో వేరొకరు పరీక్ష రాయడం వంటివి జరగవచ్చు. సీబీటీ విధానంలో పరీక్ష నిర్వహించడం వ్యయంతో కూడుకున్నది. దీంతో పరీక్ష నిర్వహణ సంస్థలు లేక అభ్యర్థులపై ఆర్థిక భారం పెరుగుతుంది.

మోదీ దురహంకారి

(మూడోపేజీ తరువాయి)

పౌరులకు మోదీ క్షమాపణలు చెప్పాలని నొక్కిచెప్పారు. 20 కోట్ల మంది ముస్లింలను కించపరిచడం ద్వారా ఆయన దేశ ప్రజలందర్నీ అవమానించారని చెప్పారు. మోదీ దురహంకారి అని, ప్రజలు తిరస్కరించినా ఆయనకు వాస్తవం బోధపడలేదని అమర్త్యసేన్ అన్నారు. 'మీరు కష్టపడి సంపాదించిన డబ్బు అక్రమ వలసదారులకు, చొరబాటుదారులకు ఇవ్వాలా? అది మీకు ఆమోదయోగ్యమేనా? వారు మన మహిళల బంగారాన్ని లాక్కుంటారు. మంగళసూత్రాలను కూడా వదిలిపెట్టరు' అంటూ ముస్లింలపై మోదీ విద్వేషాన్ని రెచ్చగొట్టారు. 2006లో ఆర్థిక ప్రాధాన్యతలపై ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన వర్గాలు, ఎస్సీ ఎస్టీలు అందరినీ ప్రస్తావించారు. మైనారిటీలకే తొలి హక్కు అని అన్నారు. కానీ ఎన్నికలు వచ్చేసరికి తమ బ్రహ్మాస్త్రం 'ముస్లింలపై మత విద్వేషాన్ని రెచ్చగొట్టడం'ను బీజేపీ ప్రయోగించింది. హిందూ ఓటు బ్యాంకును ఒక విధంగా భయపెట్టి వారి ఆదరణ పొందాలని భావించింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లింలకు సర్వం దోచిపెడుతుందని దుష్ప్రచారాన్ని చేసింది. ప్రధాని పదవి హూందాతనాన్ని మరిచి మోదీ చవకబారు వ్యాఖ్యలు చేయడాన్ని అమర్త్యసేన్ ఖండించారు. ముస్లింలను అవమానించడం ద్వారా ఆయనో భారతీయులు అందరినీ కించపరిచారని, అందుకోసం దేశ పౌరులకు ఆయన క్షమాపణ చెప్పాలని ప్రముఖ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు, మోదీ 3.0 ప్రభుత్వంపై మాట్లాడారు. బీజేపీ ఆకాంక్షించిన హిందూ దేశ స్థాపన కల సాకారం కాబోదని, రామరాజ్యం నెపంతో దేశాన్ని రావణకాష్టం చేస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ హిందూ అజెండాను ప్రజలు తిరస్కరించారని సార్వత్రిక ఎన్నికల ఫలితాలనుద్దేశించి అమర్త్యసేన్ అన్నారు. 'ఎన్నికల సమయంలో ముస్లింలను చొరబాటుదారులుగా మోదీ విమర్శించారు. రిజర్వేషన్లను దుయ్యబట్టారు. వీటివల్ల ఎక్కువ మంది పిల్లలు గల వర్గానికి లబ్ధి చేకూరుతుందని, ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీల హక్కులను ఆ వర్గం వారు హరిస్తారని ముస్లింలనుద్దేశించి వ్యాఖ్యానించారని అమర్త్యసేన్ గుర్తుచేశారు. చొరబాటుదారులుగా వ్యవహరించడం దుర్మార్గమని అన్నారు. ముస్లింలపై చేసిన వ్యాఖ్యలు మోదీ సంకుచిత ఆలోచనా ధోరణికి అద్దం పడుతుందని, దేశం గురించి ఆయన ఆలోచన తీరు సరిగ్గా లేదనిపిస్తోందని అమర్త్యసేన్ తెలిపారు. తనది సహజ జన్మ కాదని, తాను అవతార పురుషుడినని మోదీ చెప్పుకోవడాన్ని ఎద్దేవా చేశారు. 'అదంతా భ్రాంతి. ఆయన ఊహాలోకంలో విహరిస్తున్నారు' అని అమర్త్యసేన్ అన్నారు. వరుసగా మూడుసార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు సమానమైనట్లు మోదీ చెప్పుకోవడాన్ని పచ్చికూతలు అంటూ కొట్టిపారేశారు. ఇది మోదీ మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. తన పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోయినా అసలు ఏమీ జరగనట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతున్నాగానీ మోదీ అహం తగ్గలేదన్నారు. ప్రతిపక్షాన్ని దురహంకారాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారని విమర్శించారు. మోదీ వాస్తవాలకు దూరంగా తాను సృష్టించుకున్న ఊహాలోకంలో జీవిస్తున్నారని, అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని అమర్త్యసేన్ వ్యాఖ్యానించారు. మైనారిటీలను, ప్రతిపక్షాలను గౌరవించాలన్న స్పృహను కోల్పోయారని దుయ్యబట్టారు. రచయిత్రి అరుంధతీ రాయ్‌పై ఉగ్రవాద నిరోధక 'ఉపా' చట్టం కింద కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. అరుంధతీ రచనలు తనకు ఇష్టమని చెప్పారు. ఆమె విషయంలో మోదీ ప్రభుత్వ తీరు, అర్థం లేని చర్యలు తనకు కోపం తెప్పిస్తున్నట్లు అమర్త్యసేన్ తెలిపారు. దశాబ్దం కిందట చేసిన వ్యాఖ్యలకు ఇప్పుడు కేసు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయం తెలిసినప్పుడు షాక్‌కు గురైనట్లు ఆయన చెప్పారు. అరుంధతీ రాయ్‌పై కేసును ఎత్తివేయాలని, ఆమె విషయంలో ప్రభుత్వ వైఖరి సరైనది కాదని అమర్త్యసేన్ అన్నారు. కాగా, అమర్త్య సేన్ హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంబ్రిడ్జి ట్రినిటీ కాలేజి మాజీ మాస్టర్, నోబెల్ పురస్కార గ్రహీత.

పాత డీఎస్సీ రద్దు

(మూడోపేజీ తరువాయి)

నిర్ణయం తీసుకుంది. ఎలాంటి సాంకేతిక, న్యాయ సమస్యలు తలెత్తకుండా ఆ ప్రకటనను రద్దు చేసింది. ముగిసిన వైసీపీ ప్రభుత్వ హయాంలో 6,100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించగా, వాటికి దరఖాస్తులు స్వీకరించి... పరీక్షల నిర్వహణ సమయంలో ఎన్నికల కోడ్‌తో ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పోస్టులతో పాటు అదనంగా పెంచి 16,347 పోస్టులకు ప్రకటన జారీజేసింది. దీంతో గత వైసీపీ డీఎస్సీని ప్రభుత్వం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీజేసింది. గత డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ప్రస్తుతం రాబోయే నూతన డీఎస్సీ నోటిఫికేషన్‌లో పరీక్షా రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.

అయితే వారంతా మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. తాజాగా డీఎస్సీతో పాటు టెట్ నోటిఫికేషన్లకు విద్యాశాఖ సిద్ధమైంది. ముందు టెట్, ఆ తర్వాత డీఎస్సీలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది.

నేడు సామాజిక పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తొలి సారిగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి అవ్వా తాతలకు సామాజిక పెన్షన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేశారు. ఇందుకోసం గత ప్రభుత్వంలో ఉన్న వలంటీర్లను పక్కన పెట్టి గ్రామ, వార్డు సచివాలయ శాశ్వత ఉద్యోగులతో వాటిని పంపిణీ చేయనున్నారు. పెంచిన రూ.4 వేల పెన్షన్‌ను, మూడు నెలల బకాయిలను కలిపి మొత్తంగా రూ.7 వేలు ప్రతి లబ్ధిదారునికి ఇంటి వద్దే అందజేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65,18,496 మంది లబ్ధిదారులకు పంపిణీకిగాను ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేశారు. ఒక్కో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి 50 మందిని వినియోగించేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని చోట్ల ఒక్కో ఉద్యోగికీ 70 నుంచి 90 మంది లబ్ధిదారులను కేటాయించినట్లు సమాచారం. అవసరం ఉన్న చోట ఇతర విభాగాల ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోనున్నారు. మొత్తం 11 కేటగిరీల్లో తొలిరోజే రోజే 95 శాతానికి పైగా పెన్షన్ల పంపిణీకి ప్రణాళిక రూపొందించారు. మొత్తం మూడు నెలల బకాయిలతో జులై పెన్షన్ రూ.4 వేలతో కలిపి రూ.7 వేల చొప్పున పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ఈనెల 29వ తేదీ శనివారం ఆయా బ్రాంచీల బ్యాంకుల ద్వారా సచివాలయ శాశ్వత ఉద్యోగులు పెన్షన్లకు సంబంధించిన డబ్బును డ్రా చేసుకునేలా ప్రభుత్వం ఆదేశాలు జారీజేసింది. ఆ దిశగా బ్యాంకుల అధికారులూ చర్యలు తీసుకున్నారు. పెన్షన్ల పంపిణీ ప్రారంభం సందర్భంగా లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకపోయినప్పటికీ, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మరోవైపు ఈ పెన్షన్ల పంపిణీలో చంద్రబాబు స్వయంగా పాల్గొననున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం పెనుమాకలో సోమవారం ఉదయం 6 గంటలకు పంపిణీ చేయనున్నారు. అనంతరం లబ్ధిదారులు, ప్రజలతో ఆయన ముచ్చటిస్తారు. పెన్షన్ల పంపిణీలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు భాగస్వాములు కానున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లాలో పర్యటించి, పెంచిన పెన్షన్లను వృద్ధులకు పంపిణీ చేయనున్నారు. అటు పెన్షన్ల పంపిణీకి తమను దూరం పెట్టడంపై వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్లపాటు తమ సేవలను లబ్ధిదారులకు సమర్థవంతంగా వినియోగించామని, కూటమి ప్రభుత్వం వచ్చాక పక్కన పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్సీపై ఉత్కంఠ

(మూడోపేజీ తరువాయి)

నోటిఫికేషన్ లేకపోవడంతో చాలా మంది డీఎస్సీకి దరఖాస్తు చేసుకనే అవకాశాన్ని కోల్పోతున్నారు. ఈ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి. నిరుద్యోగ ఉపాధ్యాయులకు దాదాపు ఆరు సంవత్సరాలు వృథా అయింది. దీనిని దృష్టిలో ఉంచుకుని నిరుద్యోగుల విజ్ఞప్తి మేరకు వయోపరిమితిని ఆ దిశగా పొడిగిస్తారా? లేదా అనేదీ చూడాలి. ఇక మరో టెట్ ప్రకటించడంతో టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లకు మధ్య ఎంత సమయం తేడా ఉంటుందనేదీ చూడాలి. డీఎస్సీ 2024 ప్రక్రియను ఈ ఏడాది డిసెంబరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం విధించిన గడువుకు ఆర్నెల్ల ఉండటంపైనా నిరుద్యోగుల్లో విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు అంత సమయం ఉండకూడదని, మూడ్నెల్లలోపే ప్రక్రియను పూర్తి చేయాలని కోరుతున్నారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తూ జారీజేసిన జీవో 117ను రద్దు చేస్తారా?, లేదా అనేదీ చూడాలి. ఈ జీవో ప్రభావంతో ఎస్జీటీ పోస్టులు తగ్గిపోతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని నిరుద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు జీవో 117 రద్దు చేయాలని కోరుతున్నాయి. ఈ మొత్తం అంశాలకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల అనంతరం ఒక స్పష్టత రానుంది.

రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

ఎస్‌పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్

న్యూదిల్లీ : రిజర్వేషన్ల మూల సూత్రాలకు వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అఖిలేశ్ యాదవ్ ఆదివారం విమర్శించారు. అల్పసంఖ్యాక వర్గాల ప్రజల పట్ల కాషాయ పార్టీ వివక్ష చూపుతోందన్నారు. 'బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రిజర్వేషన్ల విషయంలో చిచ్చు పెట్టి... రిజర్వేషన్ల మూలసూత్రాలకు వ్యతిరేకంగా పని చేస్తోంది. దళిత, ఆదివాసీ రిజర్వేషన్లపై బీజేపీ కసరత్తు చేస్తోంది. వారు నిరంతరం ఆ పని చేస్తూనే ఉన్నారు' అని ఆయన విలేకరులతో అన్నారు. దిల్లీ, ఉత్తర ప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల నియామకాల్లో ఈ కుటుంబాల నుంచి ప్రాతినిధ్యం కరవైందని ఆందోళన వ్యక్తం చేశారు. దిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ, జవహరల్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ, బెనారస్ హిందూ యూనివర్సిటీల్లో బీసీలు, దళితులు, మైనారిటీలకు ప్రాతినిధ్యం లేదని, ఈ విశ్వవిద్యాలయాల్లో ఈ కుటుంబాలకు చెందిన వారికి 15 శాతం కంటే తక్కువగా ఉద్యోగాలు కేటాయించారని దుయ్యబట్టారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లకు సానుకూలంగా లేదని స్పష్టం చేశారు. మండల్ కమిషన్, రామ్ మనోహర్ లోహియా, బాబాసాహెబ్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్ అల్పసంఖ్యాక వర్గాల కుటుంబాల హక్కులను కాపాడాలని భావించారని, అందుకు విరుద్ధంగా బీజేపీ పని చేస్తోందని ఆయన విమర్శించారు. ఇక టీ20 ప్రపంచ కప్‌ను భారత్ హస్తగతం చేసుకోవడంపై వ్యాఖ్యానిస్తూ భారత్ విజయాన్ని దేశమంతా ఉత్సాహంగా ఆస్వాదించిందని అన్నారు.

రామస్వామి పోరాట స్ఫూర్తి ఆదర్శవంతం

- వ్యవసాయ కూలీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు
- వర్థంతి సభలో జల్లి విల్సన్, ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు: పేదలు, వ్యవసాయ కూలీల ప్రయోజనాల కోసం అహర్నిశలు శ్రమించిన కామ్రేడ్ రామస్వామి పోరాట స్ఫూర్తిని నేటితరం అందిపుచ్చుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జల్లి విల్సన్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. భూస్వాములకు, వ్యవసాయ కూలీలకు మధ్య నాయకుడిగా ఉంటూ వ్యవసాయ కూలీల హక్కుల కోసం, కూలీ రేట్లు పెంపుదల కోసం, వారి జీవన అభ్యున్నతికై అలుపెరుగని పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి రామస్వామి అని కొనియాడారు. సామాజిక న్యాయం కోసం నినదించిన గొప్ప వ్యక్తి రామస్వామి అని అన్నారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో పల్లెనొసటన పొడిచిన ఎర్ర సూర్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అమరజీవి కామ్రేడ్ కాబోతు రామస్వామి 68వ వర్థంతి కార్యక్రమం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి అధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రామస్వామి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన జల్లి విల్సన్ మాట్లాడుతూ ఆనాడు వ్యవసాయ కూలీలుగా పనిచేసే వారికి అక్షర జ్ఞానం ఉండేది కాదని, పనికి తగ్గ వేతనాలు వారికి లభించేవి కావని అన్నారు. అలాంటి వారికి పనికి తగ్గ వేతనాలు సాధించుకోవడంలో రామస్వామి సఫలీకృతులయ్యారన్నారు. వ్యవసాయ కూలీలలో చైతన్యం నింపడంతో పాటు వారిని ఐక్యం చేసి రైతులతో సంప్రదింపులు జరిపి వేతనాలు పెంచడంలో రామస్వామి కీలకంగా వ్యవహరించారన్నారు. కూలి రేట్ల కోసం పోరాడాల్సిన పరిస్థితి నుంచి డిమాండ్ చేసి కూలీ పెంచుకునే పరిస్థితికి వ్యవసాయ కూలీలు వచ్చారంటే అది వ్యవసాయ కార్మిక సంఘం, ఎర్ర జెండా సాధించిన ఘనతేనని అన్నారు. సంపద సృష్టికర్తలలో ఒకరిగా ఉంటూ ఉత్పత్తి కోసం పాటుపడుతున్న వ్యవసాయ కూలీలకు పెన్షన్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం, ఎర్రజెండా విశేష కృషి సల్పాయని, దాని ఫలితంగానే నేడు రూ.4 వేల సామాజిక పెన్షన్‌ను పేదలు అందుకోబోతున్నారని అన్నారు. అంతేకాకుండా ఇళ్ల స్థలాలు, సాగు భూముల కోసం భూ పోరాటాలు చేసిన ఘనత కూడా ఎర్రజెండాకే దక్కుతుందన్నారు. ఆనాడు రామస్వామి లాంటి త్యాగధనులు చేసిన పోరాటాలు, ఉద్యమాలు, సాధించిన విజయాల ఫలితాలను నేడు పేదలు, బడుగు బలహీనవర్గాలు అనుభవిస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రథమ అధ్యక్షుడిగా, రాష్ట్ర అధ్యక్షులుగా రామస్వామి పనిచేశారని గుర్తుచేశారు. అటువంటి మహనీయుని ఉద్యమ త్యాగాల చరిత్రను కొనసాగించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నిర్మొహమాటంగా మాట్లాడే గుణం, తప్పును తప్పు అని చెప్పే లక్షణం, పేదలకు, వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేస్తే నిలదీసే యువ కార్యకర్తగా రామస్వామికి మంచి గుర్తింపు ఉందన్నారు. చిన్నవయసులోనే భూస్వాములు, పెత్తందారుల దాష్టికాలకు వ్యతిరేకంగా పోరాడిన రామస్వామి దావులూరులో బలమైన నాయకునిగా ఎదిగారని అన్నారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీల హక్కుల కోసం జరిగిన ఉద్యమాలకు రామస్వామి నాయకత్వం వహించి విజయం సాధించారని గుర్తుచేశారు. ఇటువంటి నాయకులను స్మరించుకోవడమేకాక వారి లక్ష్య సాధనకు మరింతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే వారికిచ్చే నిజమైన నివాళి అవుతుందన్నారు. రామస్వామి అందించిన స్ఫూర్తితో గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలు, కష్టజీవులను వృద్ధిలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ... భారత కమ్యూనిస్టు పార్టీకి తన జీవితాన్ని త్యాగం చేసిన కార్యధీరుడు రామస్వామి అని కొనియాడారు. రవాణా సౌకర్యం లేని రోజుల్లోనే జిల్లా మొత్తం తిరిగి వ్యవసాయ కార్మికుల్లో చైతన్యం చేయడం కోసం కార్యక్రమాలు నిర్వహించేవారని గుర్తుచేశారు. ఆనాడు ఆయన చేసిన కృషి నేడు వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాణానికి పునాదిలా నిలిచిందని అన్నారు. ఆయన వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు నేటి సంఘ నాయకత్వం కృషి చేయాలని సూచించారు. తొలుత ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు ఆలోచింపచేశాయి. ఈ సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తన్నీరు ప్రభుదాస్, రామస్వామి మనుమరాలు కోటేశ్వరి, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు బి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత గల కమ్యూనిస్టు అతుల్ కుమార్ అంజన్

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-ఖమ్మం: అతుల్ కుమార్ అంజన్ నిబద్ధత గల కమ్యూనిస్టు అని, రైతాంగ సమస్యలపై అవగాహన కలిగిన నాయకుడని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల సందర్భంగా ఆదివారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఇటీవల మరణించిన సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అతుల్ కుమార్ అంజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ విద్యార్థి, యువజన ఉద్యమాల నుంచి అతుల్ కుమార్ అంజన్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ వచ్చారన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యునిగా, అఖిల భారత రైతు సంఘం జాతీయ అధ్యక్షునిగా పని చేశారన్నారు. అంజన్ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని నారాయణ తెలిపారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, బాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సీఎం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అదనపు కార్యదర్శిగా కార్తికేయ మిశ్రా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ మిశ్రా ఆదివారం ఉత్తర్వులు జారీజేశారు. కార్తికేయ ప్రస్తుతం కేంద్ర ఆర్థికశాఖ సంచాలకులుగా ఉన్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయనను ఏపీకి పంపాలని కేంద్రానికి లేఖ రాశారు. సీఎం లేఖపై స్పందించిన కేంద్రం... కార్తికేయ మిశ్రాను ఏపీకి పంపాలని నిర్ణయించింది. ఇప్పటికే సీఎం ముఖ్యకార్యదర్శిగా ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు. పాలనా పరమైన సంస్కరణలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న ఉన్నతాధికారులను పక్కనపెట్టి, గతంలో చంద్రబాబు ప్రభుత్వానికి నమ్మకంగా ఉన్న వారికి కీలక బాధ్యతలను అప్పగిస్తున్నారు.

హామీలు అమలుపర్చండి

రాజకీయ వేధింపుల నుంచి రక్షించండి
సీఎంకు ఆశా సంఘం నేతల వినతి

విశాలాంధ్ర-కడప రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిని సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. స్థానిక కమలాపురంలో యూనియన్ నియోజకవర్గ అధ్యక్షురాలు కె. వరలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సుభాషిని మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో జరిగిన అనేక బహిరంగ సభలలో ... ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేస్తానని, ఉద్యోగ భద్రత కల్పిస్తానని చంద్రబాబు వాగ్దానం చేశారని చెప్పారు. సీఎంగా తక్షణమే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఆందోళనకు స్పందించి... రికార్డులు సరఫరా చేస్తామని, ఆశా మరణిస్తే మట్టి ఖర్చులు రూ.20 వేలు ఇస్తామని, సాధారణ,, మెటర్నటీ సెలవులు ఇస్తామని, రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతామని చర్చల్లో హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం లేకుండా అనేక సమస్యలతో అల్లాడుతున్నారని అన్నారు. సంబంధం లేని పనులను చేయిస్తున్నారని చెప్పారు. ఆశాలకు రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు కల్పించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే టీడీపీ మండల, గ్రామస్థాయి నాయకులు... ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఆశాలను బెదిరిస్తున్నారని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. టీఏ, డీఏ సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. ఏఎన్ఎం శిక్షణ పూర్తిచేసిన వారికి పదోన్నతి కల్పించి ఏఎన్ఎంగా నియమించాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకుంగటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ నియోజకవర్గ కార్యదర్శి పి. చంద్రశేఖర్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యు.మరియమ్మ, కే.కల్పన, కోశాధికారి సి.అమ్ములు, జిల్లా ఉపాధ్యక్షురాలు అనసూయ, నియోజకవర్గ నాయకురాలు సుధారాణి, అనిత, నాగలక్ష్మి, సుబ్బమ్మ, లక్ష్మీ భవాని, నారాయణమ్మ, జయకుమారి, వరలక్ష్మి పాల్గొన్నారు.

సామాజిక పెన్షన్ల పెంపు అభినందనీయం

ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై వడ్డీ పెంచాలి: ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు: సామాజిక పెన్షన్లను పెంచడం అభినందనీయమని సామాజిక పెన్షనర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, పూర్తి అంగవైకల్యం ఉన్నవారికి రూ.15వేలు చొప్పున ఇవ్వడం హర్షణీయమన్నారు. రోజుకు రూ.200 చొప్పున నెలకు కనీసం రూ.6 వేలకు సామాజిక పెన్షన్‌ను పెంచాలని రెండేళ్లుగా లక్షలాది మందితో గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీలు ఇప్పించినట్లు తెలిపారు. భవన నిర్మాణ రంగ కార్మికులు, ముఠా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని కోరగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4వేలకు పెంచి దన్నారు. పింఛన్ దారులకు ప్రత్యేక ఆరోగ్య బీమా సదుపాయం కల్పించడంతో పాటు వృద్ధుల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై వడ్డీని పెంపొంచాలి, అర్హులైన భార్యాభర్తలు ఇద్దరికీ పెన్షన్ ఇవ్వాలని కోరారు. పెన్షనర్లకు 50 శాతం రాయితీతో బస్సు, రైళ్లల్లో ప్రయాణ సౌకర్యం కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం అవసరమైతే కేంద్రంతో సంప్రదింపులు జరపాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు సూచించారు.

నేటి నుంచి 'స్టాప్ డయేరియా'

వైద్యారోగ్య శాఖ సన్నద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 'స్టాప్ డయేరియా' అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిం చేందుకు జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు ఏపీ వైద్యారోగ్య శాఖ సర్వ సన్నద్ధమైంది. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రిసత్యకుమార్ యాదవ్, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు దిశానిర్దేశం మేరకు అన్ని జిల్లా, సెకండరీ హెల్త్ ఆసుపత్రులు, వైద్యారోగ్య శాఖాధికారులకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ఆరోగ్యశాఖ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేళ్ల లోపు చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి మరణాల బారిన పడకుండా ఉండేందుకు కేంద్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ 'స్టాప్ డయేరియా' ప్రచార కార్యక్రమాన్ని రూపొందించింది. జూన్ 14 నుంచి సన్నాహక చర్యల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టగా... జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. డయేరియా (నీళ్ల విరోచనాల) కారణంగా సంభవిస్తున్న చిన్నారుల మరణాలను నిరోధించడమే లక్ష్యంగా దీన్ని రూపొందించారు. ఇప్పటికే అమలులో ఉన్న డయేరియా నివారణ కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ఇవ్వడంతో పాటు రెండు వారాల పాటు జింక్ ట్యాబ్లెట్లు ఇస్తున్నారు. దీన్ని మరింత విస్తరించి కొత్తగా రూపొందించిన స్టాప్ డయేరియా కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు 2 ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు 14 రోజులకు సరిపడా జింక్ ట్యాబ్లెట్లను కూడా అందజేస్తారు.

శ్రీహరిరావు జీవితం మహోన్నత ప్రేరణ

వర్థంతి సభలో వక్తలు

విశాలాంధ్ర-అవనిగడ్డ: కమ్యూనిస్టు యోధ మోదుమూడి శ్రీహరిరావు జీవితం మహోన్నత ప్రేరణనీ, కమ్యూనిస్టు నాయకునిగా ఆయన సేవలు నిరూపమానమనీ. ఉత్తమమైన, ఉన్నతమైన మానవ జీవితాన్ని ఎలా జీవించాలో ఆయన జీవిత చరిత్రను చూసి తెలుసుకోవచ్చునని ప్రముఖ వైద్యులు డాక్టరు కుప్పా రామస్వామి శాస్త్రి అన్నారు. కృష్ణాజిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన మోదుమూడి శ్రీహరిరావు 25వ వర్థంతి ఆదివారం సాయంత్రం ఆయన స్వస్థలం రామచంద్రపురంలో సీపీఐ జిల్లా నాయకులు మోదుమూడి రామారావు అధ్యక్షతన జరిగింది. సభలో రామస్వామి శాస్త్రీ మాట్లాడుతూ, సీటు కోసమో, ఓటు కోసమో, పదవి కోసమో, పైసా కోసమో మాటను, బాటనూ మార్చుకునే నేటి రాజకీయ విన్యాసాల వేళలో అంకిత భావం, నిబద్ధమైన ఆశయ ప్రస్థానంగల శ్రీహరిరావు స్మరణ కారు చీకట్లో కాంతి రేఖలా కనపడుతుందన్నారు. మానవీయ విలువలకు, ఆచరణీయవాదానికి శ్రీహరిరావు చిరునామా. దాదాపు అర్ధశతాబ్దపు రాజకీయ జీవితంలో బడుగుల గొంతుకగా మారి, వారిని గెలిపించేందుకు అలుపెరగని కృషి చేసిన మహోన్నత మానవతామూర్తిగా, ఆ కాలపు మహనీయుడిగా వెలుగొందారని చెప్పారు. గ్రామ ఉపసర్పంచ్ బచ్చు ఆంజనేయులు మాట్లాడుతూ, ఉదాత్త స్వభావం, దాతృత్వం, సోషలిజం, కమ్యూనిజంపై శ్రీహరిరావుకున్న నిబద్ధత ఎనలేనిదనీ, ఆయన జీవితమే ఒక పోరాటం...పోరాట జీవులకు నిరంతరం మార్గనిర్దేశం అని చెప్పారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఎం. నెలబాలుడు, యల్లాప్రగడ రవికుమార్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దాలిపర్తి కృష్ణమూర్తి, యల్లాప్రగడ విజయలక్ష్మీ తదితరులు మాట్లాడుతూ, సిద్ధాంతమే వేదాంతంగా, పోరాటమే ఊపిరిగా కమ్యూనిస్టు ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శమూర్తి అమరజీవి మోదుమూడి శ్రీహరిరావు అనీ, కమ్యూనిస్టు ఉద్యమం ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దితే... ఆయన కమ్యూనిస్టు ఉద్యమానికే వన్నె తీసుకువచ్చారన్నారు. శ్రీహరిరావు, లలితాదేవి దంపతుల జ్ఞాపకార్థం గ్రామంలో పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు పొందిన ఆరుగురు విద్యార్థులకు పారితోషికాన్ని అందజేశారు. గ్రామ ప్రజల సౌకర్యార్థం నాలుగు సిమెంట్ బల్లలను గ్రామ పంచాయతీ సర్పంచ్ వాకా రమేశ్‌కు అందజేశారు. తొలుత మోదుమూడి సతీశ్ సభ ఉద్దేశాన్ని వివరించారు. విద్యార్థులు ఆలపించిన గేయాలు అందరిని అలరించాయి.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న డాక్టర్ కుప్పా రామస్వామి శాస్త్రి

2 నుంచి అందుబాటులోకి ఏపీ టెట్ సమాచారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ టెట్ (జులై)-2024 ఆన్‌లైన్ పరీక్షల సమాచారం జులై 2 నుంచి అందుబాటులో ఉంటుందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ తెలిపారు. పరీక్ష షెడ్యూల్, నోటిఫికేషన్లు, సిలబస్‌పై అభ్యర్థులకు సూచనలు, విధివిధానాలు వంటివన్నింటిని సీఎస్ఈ. ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచుతామని కమిషనర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మరింత సమాచారం కోసం పాఠశాల విద్యశాఖ కార్యాలయం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు.

కేదార్‌నాథ్‌లో మంచు ఉప్పెన

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని 'కేదార్‌నాథ్ ధామ్' సమీపంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. కేదార్‌నాథ్ ఆలయానికి నాలుగు కిలోమీటర్ల ఎగువన ఉన్న గాంధీ సరోవర్‌పై ఆదివారం మంచు ఉప్పెన విరుచుకుపడింది. చోరాబరి హిమానీనదంలోని గాంధీ సరోవర్ ఎగువ ప్రాంతం నుంచి పెద్దమొత్తంలో మంచు కిందికి దూసుకొస్తున్న దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆలయ సందర్శనకు వెళ్లిన భక్తులు ఇదంతా తమ ఫోన్‌లలో చిత్రీకరించారు.

మోదీతో కలిసి అరకు కాఫీ తాగాలని ఉంది: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రధాని మోదీతో కలిసి మరోసారి అరకు కాఫీ తాగాలనుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఆ అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు ఆయన ఆదివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. 2016లో మోదీతో కలిసి విశాఖలో అరకు కాఫీ తాగిన సందర్భాన్ని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. గిరిజనులు పండించే అరకు కాఫీ గొప్పతనాన్ని గుర్తుచేసుకుంటూ ప్రధానితో నాడు దిగిన ఫోటోను చంద్రబాబు పంచుకున్నారు. అరకు కాఫీని గిరిజన సోదరీమణులు ప్రేమ, భక్తితో పండిస్తారని తెలిపారు. ఇది గిరిజన సాధికారత, ఆవిష్కరణల సమ్మేళనాన్ని సూచించిందని, రాష్ట్ర ప్రజల అపరిమిత సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుందని సీఎం పేర్కొన్నారు. దీన్ని గుర్తించి ఆంధ్ర ఉత్పత్తిని ఆమోదించిన మోదీకి కృతజ్ఞతలంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

దిల్లీ జలమయం

న్యూదిల్లీ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దేశ రాజధాని దిల్లీ జలమయమైంది. రహదారులు నదులను తలపిసుండటంతో రాకపోకలు స్తంభించాయి. విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. 24 గంటల్లో 64 విమానాలు రద్దు అయ్యాయి. ఆదివారం పరిస్థితి కాస్త మెరుగై విమానాలు రాకపోకలు సాగించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. టెర్మినల్ వన్ పైకప్పు పాక్షికంగా కూలిన క్రమంలో దానిని మూసివేసినట్లు పేర్కొన్నాయి. వర్షాల కారణంగా దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో 13 మంది చనిపోయారు. వీరిలో 10 మంది దిల్లీ పరిధిలో, మరో ముగ్గురు నోయిడాలో ప్రాణాలు కోల్పోయారు. ఔటర్ దిల్లీలోని బద్లీ ప్రాంతంలో అండర్‌పాస్‌లో ఇద్దరు పిల్లలు నీట మునిగిపోగా, ఉస్మాన్‌పూర్‌లో వర్షంలో ఆడుకుంటూ మరో ఇద్దరు పిల్లలు ప్రమాదవశాత్తు చనిపోయారు. షాలిమార్ బాగ్‌లోని అండర్‌పాస్‌లో చిక్కుకొని 20ఏళ్ల యువకుడు, ఓక్లా అండర్‌పాస్‌లో 60ఏళ్ల వృద్ధుడు మరణించారు. రోహిణిలోని ప్రేమ్‌నగర్‌లో విద్యుత్ షాక్ తగిలి 39ఏళ్ల వ్యక్తి చనిపోగా, కిరారీ ప్రాంతంలో విద్యుదాఘాతంతో ఒకరు చనిపోయారు. గ్రేటర్ నోయిడాలోని సూరజ్‌పూర్

వీడని వర్షాలు
2 వరకు ఆరెంజ్ అలర్ట్
13కు పెరిగిన మృతులు

పరిధిలోని ఖోడ్నా కలన్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటి గోడ కూలి ముగ్గురు పిల్లలు మృతి చెందారు.

రాగల 24 గంటల్లో భారీ వర్షాలు పడవచ్చని ఐఎండీ అంచనా వేసింది. జులై 2వ తేదీ వరకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. గత 24 గంటల్లో తొమ్మిది మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. మంగళవారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని, ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఐఎండీ పేర్కొంది. ఎన్‌సీఆర్ (దాద్రీ, గ్రేటర్ నోయిడా) చుట్టుపక్కల ప్రాంతాల్లో గంటకు 30-40కిమీల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు కురవచ్చని వెల్లడించింది. ఎన్‌సీఆర్ (బల్లబ్‌ఘర్), బవాల్ (హర్యానా)లో జల్లులకు అవకాశమున్నట్లు 'ఎక్స్'లో ఐఎండీ పేర్కొంది. 88ఏళ్లలో లేనంతగా శుక్రవారం వర్షం కురిసిన విషయం తెలిసిందే. వర్షాలతో దిల్లీలో కాలుష్యం తగ్గింది. గాలి నాణ్యత పెరిగింది. ఆదివారం ఉదయం 9 గంటలకు దిల్లీలో ఏక్యూఐ 97గా ఉన్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది. జల దిగ్బంధంలో ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్య పనుల వేగాన్ని పెంచినట్లు ఎన్‌డీఎంసీ వైస్ చైర్మన్ సతీశ్ ఉపాధ్యాయ తెలిపారు. నీళ్లను పంప్ చేస్తున్నట్లు చెప్పారు.

మరిన్ని వర్షాలు కురిసేందుకు అవకాశాలు ఉన్నందున తమ ఏర్పాట్లను కూడా పెంచామని, ఎక్కువమంది సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు. ల్యూటెన్స్ దిల్లీలో పారిశుద్ధ్య పనులను సీసీటీవీ కెమెరాల ద్వారా ఎన్‌డీఎంసీ సెంట్రల్ కమాండ్, కంట్రోల్ రూమ్ సమీక్షిస్తున్నామని చెప్పారు. సూపరింటెండింగ్ ఇంజినీర్ల అధ్వర్యంలో పనులు జరుగుతున్నట్లు ఉపాధ్యాయ వెల్లడించారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ఎంపీల బంగళాలు సైతం జలమయం అయినట్లు వెల్లడించారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న ఓక్లా అండర్‌పాస్‌లో ట్రాఫిక్‌ను నిలిపివేసినట్లు దిల్లీ పోలీసులు ప్రకటించారు. ఆ ప్రాంతానికి చెందిన వారెవరూ ప్రయాణాలు పెట్టుకోవద్దని సూచనలు చేశారు.

నేనూ సీఎం రేసులో ఉంటా

కర్నాటక మంత్రి సతీశ్ జార్కిహొళి

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అంతా సమైక్యంగా ఉన్నామనేలా కనిపించిన కర్నాటక కాంగ్రెస్ నాయకుల మధ్య ఇటీవల విభేదాలు తారస్థాయికి చేరుతున్నాయి. ఎవరికివారుగా చేస్తున్న వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి చిక్కోడీలో మీడియాతో బాంబు పేల్చారు. ముఖ్యమంత్రి మార్పు విషయమై స్వామిజీలు కూడా చర్చలకు దిగారని అన్నారు. 2028లో తాను కూడా ముఖ్యమంత్రి పదవి కోసం డిమాండ్ చేస్తానని అన్నారు. పరోక్షంగా సీఎం పదవిపై ఆశలు పెట్టుకున్న డీకే శివకుమార్‌కు పోటీ అనే సందేశం ఇచ్చారు. 2028లో శాసనసభ ఎన్నికల తర్వాత అప్పటి ఫలితాలనుబట్టి తాను ముఖ్యమంత్రి కావాలని కోరతా అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి మార్పు అనేది ముగిసిన అధ్యాయమన్నారు. నాయకత్వ మార్పు అధిష్టానం తీర్మానిస్తుందని, డీసీఎంల అంశం కూడా అధిష్టానమే నిర్ణయిస్తుందన్నారు. ఇటీవల విశ్వ ఒక్కలిగ మహాసంస్థాన మఠం మఠాధిపతి చంద్రశేఖరస్వామిజీ ముఖ్యమంత్రి పదవి నుంచి సిద్దరామయ్య తప్పుకుని డీకే శివకుమార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తాజాగా వీరశైవలింగాయత సామాజిక వర్గం నుంచి పంచపీఠం శ్రీశైలమఠాధిపతి జగద్గురు డాక్టర్ చిన్న సిద్దరామ పండితారాధ్య శివాచార్యతోపాటు బాళెహొన్నూరు రంభాపురిమఠం డాక్టర్ వీరసోమేశ్వర జగద్గురు లింగాయతలకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని లేనిపక్షంలో కనీసం డీసీఎం అయినా ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో సతీశ్ జార్కిహొళి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

మోదీ ఆదేశాలతోనే కేజ్రీవాల్ అరెస్ట్: ఎంపీ సంజయ్ సింగ్

న్యూదిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకే దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసిందని ఆ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఈడీ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని... దర్యాప్తు సంస్థ దురుద్దేశంతోనే ఈ పని చేస్తుందని కోర్టు (రౌస్ అవెన్యూ కోర్టు) తన ఆర్డర్‌లో పేర్కొందన్నారు. ఈడీ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని... డబ్బులు రికవరీ చేయలేదన్నారు. కేజ్రీవాల్ నిర్దోషి అన్నారు. ఈడీ ఉత్తర్వుల కాపీని తీసుకోకుండా... రాజ్యాంగ , చట్ట విరుద్ధంగా హైకోర్టును ఆశ్రయించి ఆ బెయిల్‌పై స్టే తీసుకువచ్చిందన్నారు. ఆ తర్వాత అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ ఆదేశాలతో అరెస్టు చేసిందన్నారు. కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు నుంచి బెయిల్ రావడం ఖాయమని... ఆ సమయంలో మోదీ ప్రభుత్వం సీబీఐని వెళ్లి అరెస్టు చేయాలని చెప్పిందని... దర్యాప్తు సంస్థలను ఎంత బహిరంగంగా దుర్వినియోగం చేస్తున్నారో చెప్పడానికి ఇంతకంటే పెద్ద ఉదాహరణ మరొకటి ఉండదని విమర్శలు గుప్పించారు. ప్రధాని ఎలాంటి దురుద్దేశంతో పని చేస్తున్నారో దేశం మొత్తం చూస్తోందని... మీ ఈడీ, సీబీఐ చర్యలకు వ్యతిరేకంగా రేపు భారత కూటమికి చెందిన అన్ని పార్టీలు పార్లమెంట్ హౌస్‌లో నిరసన తెలుపుతాయన్నారు. ఈడీ, సీబీఐ దుర్వినియోగానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు.

జార్ఖండ్‌లో కూలిన వంతెన

రాంచీ: గడిచిన రెండు వారాల్లో బీహార్‌లో నాలుగు వంతెనలు నేలమట్టమయ్యాయి. కోట్లాది వ్యయంతో నిర్మించిన వంతెనలు పేకమేడల్లా కూలిపోయాయి. తాజాగా జార్ఖండ్‌లోని గిరిదిహ్ జిల్లాలో నిర్మాణంలో వంతెన కుప్పకూలింది. డియోరీ సబ్‌డివిజన్‌లోని ఫతేపూర్-భెల్వాఘటి గ్రామాల మధ్య రాకపోకలకు వీలుగా రూ.ఐదు కోట్లకుపైగా వ్యయంతో అర్గా నదిపై ఈ వంతెన నిర్మిస్తున్నారు. ఘటనలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. అయితే, ఈ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. నదిలో నీటి పరిమాణంతో పాటు వేగంగా ప్రయాణించడంతో శనివారం రాత్రి వంతెన కూలిపోయింది. వంతెన శిథిలాలు నదిలోనే పడిపోయాయి. ఓ పిల్లర్ పక్కకు ఒరిగిపోయింది. రూ.5.5 కోట్ల అంచనా వ్యయంతో ఓం నః శివాయ కన్‌స్ట్రక్షన్స్ అనే ప్రైవేట్ సంస్థ నిర్మాణ పనులు చేపట్టింది. నదిలో నీరు వేగంగా రావడం వల్లే వంతెన కూలిందని ఓ వ్యక్తి తెలిపాడు. కూలిపోయిన సమయంలో భారీ శబ్దం వచ్చిందని వివరించారు. అధికారులు వంతెనను పరిశీలించారు.

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి పోటీ: చిరాగ్ పాశ్వాన్

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం నితీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్డీయే కూటమి పోటీ చేస్తుందని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ వెల్లడించారు. పట్నాలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో విపక్షం ఎన్నో అంశాలు చెబుతూ హామీల వర్షం కురిపించినా వాస్తవంగా ఫలితాలు ఎలా ఉన్నాయెూ చూశామని చెప్పారు. బీహార్‌లో తాము అత్యధిక స్థానాలు గెలుచుకున్నామని, తమ పార్టీ పోటీ చేసిన ఐదు స్థానాల్లోనూ విజయం సాధించిందని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే బీహార్ అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ప్రజలు గుర్తెరిగారని పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీహార్‌లో ఎన్డీయే ఘన విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మరోవైపు బీహార్‌కు ప్రత్యేక హోదా ప్రకంటించాలని లేనిపక్షంలో ప్రత్యేక ప్యాకేజ్‌ను కేటాయించాలని బీహార్ సీఎం నితీశ్ కుమార్ సారథ్యంలోని జేడీ(యూ) ఓ తీర్మానం ఆమోదించింది. ఎన్డీయే సర్కార్‌లో జేడీ(యూ) కీలక భాగస్వామి కావడంతో ఆ పార్టీ బీహార్‌కు ప్రత్యేక హోదాపై బలంగా గళం వినిపించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పలు రాష్ట్రాలు హోదా కోసం గత కొన్నేండ్లుగా డిమాండ్ చేస్తున్న క్రమంలో బీహార్‌కు ప్రత్యేక హోదాపై ఎన్డీయే కీలక భాగస్వామి జేడీయూ పట్టుబడుతుండటంతో బీజేపీ పాలకుల తదుపరి అడుగులు ఎలా ఉంటాయనేది ఆసక్తి రేపుతోంది.

కొడనాడు కేసును ఇంటర్‌పోల్ సాయంతో విచారణ జరపాలి: స్టాలిన్

చెన్నై: నీలగిరి జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితకు సొంతమైన కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడీ తదితర ఘటనలకు సంబంధించిన కేసును ఇంటర్‌పోల్ సాయంతో విచారణ జరపాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర పోలీసు శాఖకు సంబంధించి కొత్త పథకాలను ప్రకటించిన ముఖ్యమంత్రి స్టాలిన్, కొడనాడు కేసుకు సంబంధించి మాట్లాడారు. కొడనాడు కేసును రాష్ట్రప్రభుత్వం కీలకమైన కేసుగా పరిగణలోకి తీసుకుందని, ఈ కేసులో ఇప్పటివరకు 268 సాక్షుల వద్ద విచారణ జరిపినట్లు తెలిపారు. నిందితులు ఉపయోగించిన 8 సెల్‌ఫోన్లు, నాలుగు సిమ్‌కార్డులను కోయంబత్తూర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ ల్యాబ్ నుంచి 8,000 పేజీల నివేదిక పొందామని, సంఘటన జరిగిన సమయంలో కొంతమంది నిందితులకు విదేశాల నుంచి సెల్‌ఫోన్ కాల్స్ వచ్చాయన్నారు అందువల్లే ఈ కేసులో ఇంటర్‌పోల్ సాయంతో విచారణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం తెలిపారు.

పోలీసుశాఖకు వరాల జల్లు

హెూంశాఖను కూడా నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పోలీసుశాఖపై వరాల జల్లు కురిపించారు. పాత భవనాల్లోని పోలీసుస్టేషన్లకు కొత్త భవనాలు నిర్మించి ఇస్తామని, శాఖను పటిష్ఠ పరిచేందుకు కొత్త పోస్టులను రూపొందిస్తామని, వాహనాలు, పరికరాల కొనుగోలుకు భారీగా నిధులు కేటాయిస్తామని తెలిపారు.

నేటి నుంచి కొత్త క్రిమినల్ చట్టాల అమలు

న్యూదిల్లీ: బ్రిటీష్ కాలం నుంచి దేశంలో అమల్లో ఉన్న మూడు క్రిమినల్ చట్టాలు జులై 1 నుంచి కనుమరుగు కానున్నాయి. వీటి స్థానంలో డిసెంబర్ 2023లో పార్లమెంట్ ఆమోదించిన మూడు కొత్త చట్టాలు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. మూడు కొత్త చట్టాలను ఇండియన్ జ్యుడీషియల్ కోడ్, ఇండియన్ సివిల్ డిఫెన్స్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ అని పిలుస్తారు, ఇవి ఇండియన్ పీనల్ కోడ్ (1860), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (1898), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (1872) స్థానంలో అమల్లోకి రానున్నాయి. ఇండియన్ పీనల్ కోడ్‌లో 511 సెక్షన్లు ఉండగా.. ఇండియన్ జ్యుడీషియల్ కోడ్‌లో 358 సెక్షన్లు మిగిలి ఉన్నాయి. సవరణ ద్వారా ఇందులో 20 కొత్త సెక్షన్‌లను చేర్చగా, 33 నేరాల్లో శిక్షా కాలం పెంచారు. 83 నేరాల్లో జరిమానా మొత్తాన్ని కూడా పెంచారు. 23 నేరాల్లో తప్పనిసరిగా కనీస శిక్ష విధించాలనే నిబంధన ఉంది. మరో ఆరు నేరాల్లో కూడా శిక్ష విధించే నిబంధన ఉంది.

12 డిసెంబర్ 2023న, కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో మూడు సవరించిన క్రిమినల్ చట్టాలను ప్రవేశపెట్టింది. ఇండియన్ జస్టిస్ కోడ్, ఇండియన్ సివిల్ ప్రొటెక్షన్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్. ఈ బిల్లులను డిసెంబర్ 20, 2023న లోక్‌సభ ఆమోదించగా.. డిసెంబర్ 21, 2023న రాజ్యసభ ఆమోదించింది. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టిన బిల్లులను రాజ్యసభలో వాయిస్ ఓటింగ్ ద్వారా ఆమోదించారు. డిసెంబర్ 25, 2023న రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత.. బిల్లులు చట్టంగా మారాయి, అయితే చట్టాల అమలు తేదీని జూలై 1, 2024గా పేర్కొన్నారు. పార్లమెంట్‌లో మూడు బిల్లులపై చర్చ సందర్భంగా కేంద్ర హెూంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. శిక్షకు బదులు న్యాయం చేయడంపైనే దృష్టి సారించామని అన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో కలిసే పోటీ చేస్తాం

ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్

పూణె : ఈ ఏడాది అక్టోబరులో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ, కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) ఉమ్మడిగా పోటీ చేస్తాయని ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్ ఆదివారం తెలిపారు. ఇక్కడ ఒక వార్తా సమావేశంలో ప్రసంగించిన పవార్, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సంకీర్ణంలో భాగమైన చిన్న మిత్రపక్షాల ప్రయోజనాలను రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పరిరక్షించడం మహారాష్ట్రలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీల నైతిక బాధ్యత అని అన్నారు. ఎన్‌సీపీ (ఎస్‌పీ), కాంగ్రెస్, శివసేన (యూబీటీ) ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) లో భాగంగా ఉన్నాయి. ఇది థాకరే నేతృత్వంలోని ప్రభుత్వం పతనానికి ముందు నవంబరు 2019 నుంచి జూన్ 2022 వరకు రాష్ట్రంలో అధికారంలో ఉంది. పవార్ మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రజల ముందు ప్రతిపక్షాలు సమష్టిగా ఉంటాయని అన్నారు. రాష్ట్రంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని, దానిని నెరవేర్చడం విపక్షాల కూటమి నైతిక బాధ్యత అని చెప్పారు. 'అర్జునుడి లక్ష్యం (ఇతిహాసమైన మహాభారతంలో) ఒక కన్ను (చేప). మా దృష్టి అంతా మహారాష్ట్ర ఎన్నికలపైనే ఉంది. కాంగ్రెస్, ఎన్‌సీపీ (ఎస్‌పీ), ఉద్ధవ్ థాకరే శివసేన (యూబీటీ) ఉమ్మడిగా రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయనున్నాయి' అని ఆయన తెలిపారు. రాష్ట్రంలో సీట్ల పంపకంపై చర్చలు ప్రారంభం కాలేదని, త్వరలోనే ప్రారంభిస్తామని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఎన్‌సీపీ (ఎస్‌పీ), శివసేన (యూబీటీ), కాంగ్రెస్‌కు మంచి స్పందన ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. అయితే ఈ మూడు పార్టీల మాదిరిగానే వామపక్షాలు, రైతులు, కార్మికుల పార్టీ (పీడబ్ల్యూపీ) కూడా సంకీర్ణంలో భాగమే. కానీ మేము వారికి లోక్‌సభలో సీట్లు ఇవ్వలేకపోయాం. ఈ పార్టీల ప్రయోజనాలను పరిరక్షించడం మా నైతిక బాధ్యత. అందువల్ల వారితో (రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో) ముందుకు సాగడానికి ప్రయత్నాలు జరుగుతాయి' అని శరద్ పవార్ తెలిపారు. ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం శుక్రవారం సమర్పించిన రాష్ట్ర బడ్జెట్ గురించి అడిగిన ప్రశ్నకు, ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు మాట్లాడుతూ 'మీరు మార్కెట్‌లోకి ఖాళీ జేబుతో వెళితే ఏమి జరుగుతుంది? మరికొద్ది రోజులు ఆగితే వాస్తవమేంతో తేలనుంది. 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు నెలవారీ రూ.1,500 భత్యం, గృహాలకు ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు, రైతుకు అనుకూలమైన చర్యలు, నైపుణ్య శిక్షణ కోసం యువతకు నెలకు రూ.10 వేల స్టైఫండ్ వంటివి మహారాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ముఖ్యాంశాలు. రాష్ట్ర ఎన్నికలకు నాలుగు నెలల ముందు 2024-25 శుక్రవారం ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. శుక్రవారం ఇక్కడ ప్రారంభమైన వారి (తీర్థయాత్ర) 'పాల్కీ' ఊరేగింపులో మీరు పాల్గొంటారా అని అడిగిన ప్రశ్నకు, పవార్ మాట్లాడుతూ 'పాల్కీ నా గ్రామం బారామతి (పూణె జిల్లాలో) నుంచి పండర్‌పూర్‌కు వెళుతుంది. నేను బారామతిలో వారి ఊరేగింపునకు స్వాగతం పలుకుతాను' అని చెప్పారు.

ఓటేసిన ప్రజలకు అభినందనలు

రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉంచారు
'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

న్యూదిల్లీ : 2024 సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనడం ద్వారా ప్రజలు రాజ్యాంగంపై, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై తమకున్న అచంచల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పారని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అన్నారు. ఎన్నికల తర్వాత తొలిసారిగా మన్ కీ బాత్ రేడియో ప్రసంగంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో రేడియో ప్రసారానికి విరామం వచ్చింది. 'ఈ రోజు మన రాజ్యాంగం, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై అచంచలమైన విశ్వాసాన్ని నెలకొల్పినందుకు దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని మోదీ అన్నారు. 2024లో జరిగిన ఎన్నికలే ప్రపంచంలోనే అతిపెద్దవని అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో ఇంత పెద్ద ఎన్నికలు జరగలేదని, 65 కోట్ల మందికి పైగా ప్రజలు ఈ ఎన్నికల్లో ఓటు వేశారని ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్‌తో పాటు ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ప్రధాని మోదీ అభినందనలు తెలియజేశారు.

ఈ రేడియో ప్రసంగంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటేందుకు ప్రారంభించిన 'ఏక్ పెడ్ మా కే నామ్' (తల్లి పేరు మీద ఒక చెట్టు) కార్యక్రమాల గురించి ప్రధాని మాట్లాడారు. 'ప్రజలు తమ తల్లుల చిత్రాలను పంచుకోవడం ద్వారా ఇతరులకు స్ఫూర్తినివ్వడాన్ని చూసి నేను సంతోషిస్తున్నాను' అని తెలిపారు. 1857లో మొదటి స్వాతంత్ర్య సమరానికి చాలా ముందు 1855లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సంతాల్ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు వీర్ సిద్ధు, కన్హులకు కూడా ఆయన ఘనంగా నివాళులర్పించారు. అలాగే వచ్చే నెలలో జరగనున్న పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొననున్న భారత క్రీడాకారులను కూడా ప్రధాని అభినందించారు. భారత అథ్లెట్లు 900కు పైగా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నారని ఆయన వివరించారు. పారిస్ ఒలింపిక్స్‌లో తమ ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తారని దేశం ఆశిస్తున్నదని, వారిని ప్రోత్సహించేందుకు 'చీర్4భారత్' హ్యాష్‌ట్యాగ్‌ని ఉపయోగించాలని ప్రజలను కోరారు.

ప్రజా సమస్యలపై మాట్లాడరేం?

ప్రధాని 'మన్ కీ బాత్'పై కాంగ్రెస్ విమర్శ

న్యూదిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ తన రేడియో కార్యక్రమం మన్ కీ బాత్‌లో ప్రజలు వినాలనుకునే అంశాలేవీ ప్రస్తావించలేదని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఆదివారం విమర్శించారు. తన మూడవ సారి అధికారంలో 'మన్ కీ బాత్' మొదటి ఎపిసోడ్‌లో ప్రసంగించిన తర్వాత ప్రధాన మంత్రిని ఎద్దేవా చేస్తూ, కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధ్యక్షుడు ఖేరా... వైద్య విద్య ప్రవేశ పరీక్ష 'నీట్', రైల్వే ప్రమాదం లేదా 'మౌలిక సదుపాయాలు కుప్పకూలడం' గురించి ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. మోదీకి ఇది మూడోసారి అయినా, అది ఆయన సొంత బలంతో కాదని ఖేరా అన్నారు. 'ప్రభుత్వం అండదండలతో నడుస్తోంది. ఈసారి ఆయన ఏదో తెలివిగా చెబుతారని మేము అనుకున్నాం. దిల్లీ విమానాశ్రయంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన తీవ్రమైన సంఘటనపై ఆయన మాట్లాడలేదు' అని ధ్వజమెత్తారు. 'ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన ఏ అంశంపైనా ప్రధాని మాట్లాడలేదు. అజెండా మార్చడమే ఆయన పద్ధతి. అందరూ 'నీట్', కుంభకోణాల గురించి మాట్లాడుతున్నారు. అందువల్ల దృష్టి మరల్చడానికి మీరు కేరళ నుంచి గొడుగు గురించి మాట్లాడుతున్నారు' అని విమర్శించారు. ఎన్నికల సమయంలో మీరు ఉత్తరాదిని దక్షిణాదితో పోటీకి దింపారు. ప్రజలు మరిచిపోతారని భావిస్తున్నారా? ప్రచారంలో మీరు చెప్పేది నిజం, ఇప్పుడు మీరు చేస్తున్నది ప్రచారం అని ఆయన తెలిపారు. కాగా, 65 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల్లో దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజలు తమకున్న అచంచల విశ్వాసాన్ని వ్యక్తం చేశారని, మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత తన తొలి మన్ కీ బాత్ రేడియో ప్రసంగంలో ప్రధాని మోదీ ఆదివారం అన్నారు.

ఆర్యవైశ్య సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ నూతన చైర్‌పర్సన్ రేవతి బలరాం

ఆర్ ఆర్ ఆర్ క్రియేషన్స్‌తో మహిళలకు ఉపాధి కల్పన

విజయవాడ-లబ్బీపేట: ఆర్యవైశ్య ఆంధ్రప్రదేశ్ మహిళా విభాగ్ ధ్వర్యంలో ఆర్యవైశ్య సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ నూతన చైర్ పర్సన్ గా మద్దుల రేవతి బలరాం ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల ఉపాధి కలిగి తన కాళ్ల మీద తను నిలబడి ఉండాలన్నారు. అందుకోసమే అర్ అర్ ఆర్ క్రియేషన్స్ పేరుతో సంస్థను స్థాపించి ఉపాధి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తనది తిరువూరు వద్ద కంభంపాడు చిన్న గ్రామమని... ఊర్లో చాలామంది చదువుకుని ఎటువంటి ఉపాధి లేక కూలి పనులకు వెళ్తున్నారని అటువంటి సమస్యలను అధిగమించి ఉపాధి కల్పించేందుకే అర్ అర్ ఆర్ క్రియేషన్స్ పేరుతో గత సంవత్సర కాలంగా అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. 14 మందితో ప్రారంభమైన ఈ సంస్థను భవిష్యత్తులో వంద మందికి ఉపాధి కల్పించేలా తీర్చిదిద్దామని తెలియజేశారు. అర్ అర్ ఆర్ క్రియేషన్స్ ఫౌండర్ రూపా రేణుక మాట్లాడుతూ... మేడ్ విత్ లవ్ అనే లోగో తో వివాహాది శుభకార్యాలకు మన సంస్కృతి సాంప్రదాయాలకు తగ్గట్టుగా అవసరమైన అన్నిటిని బార్బీ బొమ్మల రూపంలో అందిస్తామన్నారు. చిన్నపిల్లలకు తెలుగు సాంప్రదాయాలు తెలియజేసేందుకు, మహిళలకు స్వయం ఉపాధి లక్ష్యంగా అర్ అర్ ఆర్ క్రియేషన్స్ స్థాపించామన్నారు. తమ ఉత్పత్తులు ఇప్పటికే దేశ, విదేశాలకు ఆర్డర్ల పై వెళ్తున్నాయన్నారు. భవిష్యత్తులో మరింతమందికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం అర్ అర్ ఆర్ క్రియేషన్స్ సభ్యులు దీపిక, రత్న, లక్ష్మి, నాగమణి, పావని, జస్మితరెడ్డి, అంజలి, సౌజన్య, రేఖా రాణి ల్, సంధ్యా రానీ లు ఆర్యవైశ్య సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ చైర్ పర్సన్ గా ఎంపికైన మద్దుల రేవతి బలరాం కు శుభాకాంక్షలు తెలియజేశారు..

'నీట్' నిందితులపై చర్యలు: రవిశంకర్ ప్రసాద్

పాట్నా: నీట్ వ్యవహారంపై తాము మౌనం దాల్చలేదని, చర్యలు తీసుకుంటున్నామని, నిందితులను అరెస్ట్ చేస్తున్నామని బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ మాదిరిగా తాము మాటలకే పరిమితం కాదని పేర్కొన్నారు. తాము కార్యాచరణ చేపడతామని చెప్పారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన 50 ఏళ్ల తర్వాత కూడా కాంగ్రెస్ తన తప్పిదానికి క్షమాపణలు చెప్పడం లేదని దుయ్యబట్టారు. అంతకుముందు నీట్ వివాదంపై కాంగ్రెస్ ఎంపీ, ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పందించారు. నీట్ రగడపై పార్లమెంట్ వేదికగా తాము ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. ఈ ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఏం చేస్తుందనే విషయంపై తమ డిమాండ్లను లోక్‌సభ, రాజ్యసభ ముందుంచుతామని చెప్పారు. అన్ని పరీక్షలను ఎన్టీఏ ప్రైవేట్ కంపెనీల ద్వారా నిర్వహిస్తోంది, స్కామ్‌లు ఎక్కడ నుంచి వెలుగుచూస్తున్నాయో గమనించాలని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్‌ల నుంచే ఈ స్కామ్‌లు బయటపడుతున్నాయని వివరించారు. ఈ వ్యవహారంపై చర్చ జరగాలని తాము పట్టుబడతామన్నారు. విద్యాశాఖ మంత్రి తొలుత పరీక్షల్లో అక్రమాలు లేవని అన్నారని, ఆపై చిన్నపాటి తప్పులు చోటుచేసుకున్నాయని చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు సీబీఐ విచారణ, ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు గురించి మాట్లాడుతున్నారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. నీట్ వివాదం, ప్రశ్నాపత్రాల లీకేజ్, నీట్-యూజీ పరీక్ష రద్దు వంటి అంశాలకు బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ విషయంలోనే కాకుండా నెట్, యూజీ, ఎన్‌సీఈఆర్‌టీకి సంబంధించి అంశాలున్నాయని చెప్పారు. విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే వ్యవస్థలన్నీ ఈ వ్యవహారాలతో ముడిపడిఉన్నాయని పేర్కొన్నారు. ఎన్టీఏ సైతం విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తుందని చెప్పుకొచ్చారు.